# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :94 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 12-06-2025 | పేజీలు:4 వెల: 2.00


## సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో డ్రగ్స్ కలకలం..

చేవెళ్ల : ప్రముఖ టాలీవుడ్ సింగర్ మంగ్లీ పుట్టినరోజు వేడుకలు వివాదాలకు దారితీశాయి. చేవెళ్లలోని త్రిపుర రిసార్టులో మంగ్లీ బర్త్‌డే పార్టీ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించగా.. ఈ దాడుల్లో భారీగా గంజాయి, విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ పార్టీకి హాజరైన పలువురికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో డ్రగ్స్ పాజిటివ్‌గా తేలడం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. చేవెళ్ల మండలం పరిధిలోని త్రిపుర రిసార్టు లో మంగ్లీ పుట్టినరోజు వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ పార్టీకి సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు పలువురు యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయితే పార్టీలో మాదకద్రవ్యాల వినియోగం జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు రిసార్టుపై దాడులు చేశారు. అయితే ఈ సోదాల్లో పెద్ద మొత్తంలో గంజాయి, వివిధ రకాల విదేశీ మద్యం సీసాలు లభ్యమయ్యాయి. పార్టీలో ఉన్న పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారికి డ్రగ్ టెస్టులు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కొన్ని సాంపుల్స్‌కు డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిసింది.

## పాత మంత్రుల శాఖలలో మార్పులుండవ్..



న్యూఢిల్లీ : కొత్త మంత్రులకు తన వద్ద ఉన్న శాఖలనే కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.. పాత మంత్రుల శాఖల్లో ఎటువంటి మార్పులు ఉండవని ఆయన సంకేతాలు ఇచ్చారు.. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఇవాళ తన పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు బయల్దేరే ముందు ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో జరిగిన మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని, కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుల అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. హైదరాబాద్‌కు వచ్చాక అందరితో సంప్రదించి శాఖలు నిర్ణయిస్తామన్నారు. తాను ఢిల్లీకి వచ్చింది కర్ణాటకలో కులగణన అంశంపై అధిష్టానంతో చర్చించేందుకేనని చెప్పారు. తెలంగాణలో కులగణన నిర్వహణ అంశాన్ని పార్టీ పెద్దలతో చర్చించినట్లు స్పష్టం చేశారు. అయితే పాత మంత్రుల శాఖలను మార్పు చేసే అవకాశం లేదన్నారు. తన వద్ద ఉన్న హెూం, మున్సిపల్, క్రీడలు, విద్య తో పాటు 11 శాఖలలోని కొన్నింటికి కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారికి కేటాయిస్తామని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్‌లో ఎంట్రీ లేదు..

కేసీఆర్ కుటుంబ సభ్యులే తెలంగాణకు శత్రువులు అని సీఎం రేవంత్ రెడ్డి అని స్పష్టం చేశారు. తానున్నంత వరకు కాంగ్రెస్‌లోకి కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని హాట్ కామెంట్స్ చేశారు. అసెంబ్లీ రౌడీ సినిమాలో బాషా గ్యాంగ్ మాదిరిగా బీఆర్ఎస్ నేతల పంచాయతీ ఉందని విమర్శించారు. మీడియా దృష్టిని తమవైపు తిప్పుకునేందుకు బీఆర్ఎస్ నేతలు డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కిషన్‌రెడ్డి ఒక్కటేనన్నారు. 2-3 రోజుల్లో కాళేశ్వరంపై మీడియాతో మాట్లాడుతానని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి కీలక డాక్యుమెంట్లు బయటపెడతానని చెప్పారు.

తెలంగాణకు అన్యాయం చేస్తున్నది కిషన్ రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, ప్రాజెక్టులను అడ్డుకుంటున్నదని ఆయనేనని ఆరోపించారు రేవంత్ రెడ్డి. రాష్ట్రానికి ఆయన ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని, కేబినెట్ మంత్రిగా తెలంగాణ అంశాలపై తనతో కిషన్‌రెడ్డి ఒక్క రివ్యూ కూడా జరపలేదన్నారు. మెట్రో విస్తరణ కేటీఆర్‌కు ఇష్టం లేదని అంటూ దీని కారణంగానే కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఫెయిల్ అయ్యారని విమర్శించారు.

## దేశంలో 7,121కి పెరిగిన క్రియాశీల కేసులు..

న్యూఢిల్లీ, దేశంలో మరోసారి కరోనా వైరస్ కలకలం సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఇక నిన్న ఒక్కరోజే 300కిపైగా కొత్త కేసులు వెలుగు చూశాయి. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 7 వేలు దాటింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం .. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకూ 306 మందికి పాజిటివ్‌గా తేలింది. కేరళలో అత్యధికంగా నిన్న ఒక్కరోజే 170 కేసులు బయటపడ్డాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 114 కేసులు వెలుగు చూశాయి. తాజా కేసులతో కలిపి దేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 7,121కు పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 8,573 మంది మహమ్మారి బారి నుంచి కోలుకున్నారు. 24 గంటల్లో ఆరు మరణాలు సంభవించాయి. మహారాష్ట్రలో ఒకరు, కర్ణాటకలో ఇద్దరు, కేరళలో ముగ్గురు కొవిడ్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 74కి ఎగబాకింది.

రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..

కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 2,223 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్ (1,223), ఢిల్లీ (757), పశ్చిమ బెంగాల్ (747), మహారాష్ట్ర (615),



కర్ణాటక (459), ఉత్తరప్రదేశ్ (229), తమిళనాడు (204), రాజస్థాన్ (138), హర్యాణా (125), ఆంధ్రప్రదేశ్ (72), మధ్యప్రదేశ్ (65), ఛత్తీస్‌గఢ్ (48), బీహార్ (47), ఒడిశా (41), సిక్కిం (33), పంజాబ్ (33), తెలంగాణ (11), జార?ండ్ (10), పుదుచ్చేరి (10), జమ్ము కశ్మీర్‌లో తొమ్మిది, అస్సాం, గోవా రాష్ట్రాల్లో ఆరు చొప్పున, ఛండీగఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మూడు చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో రెండు కేసులు, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్కో కేసు యాక్టివ్‌గా ఉంది.

## రేవంత్ రెడ్డి కేసీఆర్ వెంట్రుకను కూడా పీకలేడు..

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వెంట్రుకను కూడా పీకలేడు అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.

బీఆర్‌కే భవన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ అంటే ఒక చరిత్ర.. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్‌ను విచారణకు పిలిచారంటే.. హనుమంతుడి ముందు కుప్పిగంతులు లాంటిది. ఇరిగేషన్ మీద కేసీఆర్‌కు ఉన్న అవగాహన బహుషా ఈ దేశంలోని సమకాలీన రాజకీయ నాయకులలో ఎవరికి ఉండదు. చివరకు ధర్మం, న్యాయమే గెలుస్తది. తెలంగాణను సాధించిన నాయకుడిగా, సస్యశ్యామలం చేసిన నాయకుడిగా కేసీఆర్ పేరు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడుతది అని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి కూలగొట్టడానికి వచ్చాడు తప్ప కట్టడానికి రాలేదు. విధ్వంసకరమైన ఆలోచనలతో పేదల ఇండ్లు కూలగొట్టడం, ప్రాజెక్టులను కూలగొ ట్టడం.. రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు తప్ప ఈ సన్నాసికి ఏం చేతకాదు అని అర్థమైతుంది. 100 జన్మలు ఎత్తినా రేవంత్ రెడ్డి అనే చిల్లర గాడికి కేసీఆర్ గొప్పతనం అర్థం కాదు. రేవంత్ రెడ్డి గురువు, ఆయన జేజమ్మతో గొడవ పడి ఇక్కడ నుండి తరిమిన వాడే కేసీఆర్. రేవంత్ రెడ్డి అనే చిల్లరగాడు ఏం చేసినా, ఆయన ప్రభుత్వం ఏం చేసినా కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేడు. రేవంత్ రెడ్డిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేదాకా వెంటాడుతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఈ చిల్లర రాజకీయాలను పట్టించుకోవద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి



చేస్తున్నా. ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉండాలి. రేవంత్ రెడ్డిని ప్రజాక్షేత్రంలో బట్టలిప్పి నిలబెట్టే రోజులు వస్తాయి. రేవంత్ రెడ్డి లాంటి చిల్లర నాయకుడికి కేబినెట్ అంటే అర్థం కాదు.. కేబినెట్ ఎట్ల పని చేస్తదో తెలియదు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు ముఖ్యం ఆయనకు. విచారణల పేరిట రేవంత్ రాక్షసానందం పొందుతున్నారు. నిజం నిలకడగా తేలుతుంది. కొన్ని రోజులు కాళేశ్వరం అని, ఫోన్ ట్యాపింగ్ అని, ఈ ఫార్ములా అని డ్రామాలు ఆడుతున్నారు. మంత్రి వర్గ విస్తరణ చేయలేని సీఎం.. చివరకు శాఖలు కేటాయించుకోలేని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

## విద్యార్థుల సమస్యలపై రాహుల్ ఆవేదన..



ఢిల్లీ: దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈబీసీల హాస్టళ్లలో నెలకొన్న పరిస్థితులను మెరుగుపరచాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పులను తగిన సమయంలో అందించి, విద్యార్థులను ఆదుకోవాలని రాహుల్ కోరారు. దేశంలోని దళిత, ఎస్టీ, ఈబీసీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని రాహుల్ ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. అణగారిన వర్గాల వారికి పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లలో జరుగుతున్న జాప్యాన్ని ఆయన తప్పుబట్టారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన 90 శాతం మంది విద్యార్థుల విద్యకు కలిగించే సమస్యలను వెంటనే పరిష్కరించాలని గాంధీ మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇటీవల బీహార్‌లోని దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్‌ను తాను సందర్శించినప్పుడు అక్కడి అపరిశుభ్రమైన టాయిలెట్లు, అసురక్షిత తాగునీరు, మెస్ సౌకర్యాలు లేకపోవడం, లైబ్రరీలు, ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడాన్ని చూసినప్పుడు తనకు బాధ కలిగిందన్నారు. అలాగే అణగారిన వర్గాల విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందించడంలో ఆలస్యం జరుగుతున్నదన్నారు. అక్కడి స్కాలర్‌షిప్ పోర్టల్ మూడు సంవత్సరాలుగా పనిచేయడంలేదని, 2021-22లో ఏ విద్యార్థికి కూడా స్కాలర్‌షిప్ లభించలేదని రాహుల్ పేర్కొన్నారు. ఇటువంటి వైఫల్యాలు దేశవ్యాప్తంగా విస్తృతంగా ఉన్నాయని, వీటిని పరిష్కరించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. అట్టడుగు వర్గాల యువత అభివృద్ధి చెందకపోతే , దేశం అభివృద్ధి చెందదనే విషయాన్ని అందరూ అంగీకరిస్తారని తాను భావిస్తానని ఆ లేఖలో రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## అణగారిన ప్రజలకు రాజ్యాంగం శక్తినిచ్చింది : సీజేఐ గవాయ్

న్యూఢిల్లీ: రాజ్యాంగం.. సిరాతో రాసిన ఓ మౌన ఉద్యమం అని సీజేఐ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. అది మార్పు శక్తికి సంకేతమని, హక్కుల రక్షణ కల్పిస్తుందన్నారు. చరిత్రాత్మకంగా అణగారిన వర్గ ప్రజలను రాజ్యాంగం బలోపేతం చేస్తోందన్నారు. యూకేలోని ఆక్స్‌ఫర్డ్ యూనియన్ థీమ్‌పై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అట్టడుగు వర్గాల ప్రజలపై రాజ్యాంగం పాజిటివ్ ప్రభావం చూపిందన్నారు. కొన్ని దశాబ్దాల క్రితం, భారత్‌లో లక్షలాది మందిని అంటరానివారిగా చూసేవాళ్లని, అపవిత్రులని వాళ్లను భావించేవాళ్లు అని, ఎవరితో మాట్లాడవద్దు అనేవాళ్లు అని, కానీ ఇప్పుడు రోజులు మారాయని, ఆ వర్గానికి చెందిన ఓ వ్యక్తి ఈ రోజు ఓపెన్‌గా మాట్లాడుతున్నారని, న్యాయ వ్యవస్థలోని అత్యున్నత స్థాయిలో ఉండి మాట్లాడుతున్నట్లు సీజేఐ బీఆర్ గవాయ్ తెలిపారు. పౌరులకు రాజ్యాంగం ఎన్నో నేర్పిందని, అణగారిన ప్రజలు తమ కోసం తాము మాట్లాడవచ్చు అని, వారికి సమాజంలోని ప్రతి చోట సమాన స్థానం ఉందన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనియన్ వేదికగా ఓ విషయాన్ని చెప్పాలనుకుంటున్నానని, దేశంలోని అణగారిని ప్రజల తరపున మాట్లాడుతున్నానని, రాజ్యాంగం కేవలం చట్టపరమైన చార్టరో లేక రాజకీయ ఫ్రేమ్‌వర్క్ కాదన్నారు.



అదో ఫీలింగ్ అని, ఓ లైఫ్‌లైన అని, సిరాతో రాసిన ఓ మౌన ఉద్యమం అని సీజేఐ పేర్కొన్నారు. ఓ సాధారణ మున్సిపల్ స్కూల్ నుంచి .. భారత ప్రధాన న్యాయమూర్తిగా ఎదిగినట్లు ఆయన చెప్పారు. రాజ్యాంగం కేవలం లీగల్ ఫ్రేమ్‌వర్క్ కాదు అని, అదో సామాజిక, నైతిక డాక్యుమెంట్ అని, తీవ్రమైన అసమానతల మధ్య దాన్ని రూపొందించినట్లు చెప్పారు.

## అమెరికాలో భారత విద్యార్థిపై పోలీసుల కర్కశత్వం



న్యూఢిల్లీ,అమెరికాలో భారతీయులకు పదేపదే అవమానాలు ఎదురవుతున్నా.. కేంద్రంలోని బీజేపీ సర్కారులో మాత్రం చలనం రావటం లేదు. ట్రంప్ రెండో పర్యాయం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించివేసే సమయంలో భారత పౌరులకు సంకెళ్లు వేయడంపై దుమారం రేగిన విషయం తెలిసిందే. తాజాగా ఓ భారత విద్యార్థిపై అమెరికా పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. వీసా రద్దయిందని, చట్ట వ్యతిరేకంగా అమెరికాలోకి ప్రవేశించావని చెప్తూ ఎయిర్‌పోర్టులో భారత విద్యార్థిని నేలపై పడేసి, చేతులు వెనక్కి విరిచి బేడీలు వేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

భారత కాన్సులేట్ ఏం చేస్తున్నది?

ఉగ్రవాదులను కూడా ఇంత హీనంగా అమెరికాలో అరెస్టు చేయటం చూడలేదని ఘటనలో ప్రత్యక్ష సాక్షి, ప్రవాస భారతీయుడు కునాల్ జైన్ వాపోయారు. అమెరికాలో అప్పుడే అడుగుపెట్టిన ఒక భారతీయ విద్యార్థి పట్ల అమెరికా వ్యవహరించిన తీరు తనను తీవ్రంగా కలిచివేసిందని ఇందుకు సంబంధించిన వీడియో, ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఉగ్రవాదులను కూడా అమెరికాలో ఈ విధంగా అరెస్టు చేయటం చూడలేదు. నేను నిస్సహాయుడిగా ఉండిపోయాను. నా మనసు ముక్కలైంది. ఇది మానవ విషాదం ' అంటూ కునాల్ జైన్ వివరించారు. 'అమెరికాకు ఎందుకు వచ్చాడన్నది అతడు సరిగా వివరించలేదు. దాంతో పోలీసులు అతడి పట్ల దారుణంగా వ్యవహరించారు. అతనితో హిందీలో మాట్లాడేందుకు ఎవర్నీ అనుమతించలేదు. న్యాయ సహాయం కూడా నిరాకరించటం బాధాకరం' అని కునాల్ జైన్ చెప్పారు. ఇలాంటి ఘటనలు ప్రతి రోజూ 3 లేదా 4 జరుగుతున్నప్పుడు సదరు వ్యక్తులకు సాయం చేయడానికి భారత కాన్సులేట్ ఎందుకు ముందుకు రావటం లేదని ఆయన ప్రశ్నించారు.

వీసాల దుర్వినియోగాన్ని ఉపేక్షించం: అమెరికా ఎంబసీ

నెవార్క్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయ విద్యార్థికి ఎదురైన ఘటనపై భారత్‌లోని అమెరికా ఎంబసీ స్పందించింది. చట్టబద్ధంగా వచ్చే ప్రయాణికులకు మాత్రమే తమ దేశంలోకి ప్రవేశం ఉంటుందని, వాళ్లకు మాత్రమే వెల్‌కం చెబుతామని పేర్కొంది. దేశంలోకి అక్రమ ప్రవేశాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేసింది. అక్రమ ప్రవేశం, వీసాల దుర్వినియోగం, అమెరికా చట్టాన్ని ఉల్లంఘించడాన్ని సహించబోమని అమెరికా తెలిపింది. న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా స్పందించింది. సోషల్ మీడియాలో వచ్చిన పోస్ట్‌పై సంబంధిత వర్గాలతో మాట్లాడుతున్నట్టు తెలిపింది. భారత పౌరుల సంక్షేమానికి కాన్సులేట్ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నది.

మోదీ మౌనమేల?: కాంగ్రెస్

అమెరికాలో భారతీయులకు జరుగుతున్న అవమానాలపై విపక్ష కాంగ్రెస్ మండిపడింది. తాజా ఘటనపై ప్రధాని మోదీ వెంటనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికాలో భారతీయులకు పదే పదే అవమానాలు జరుగుతున్నా ప్రధాని మోదీ మౌన ముద్ర వహిస్తున్నారని, భారతీయుల ఆత్మగౌరవం కాపాడటంలో ప్రధాని మోదీ విఫలమయ్యారని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ విమర్శించారు. ఆయన 'ఎక్స్'లో స్పందిస్తూ, 'భారత్-పాక్ కాల్పుల విరమణ ప్రకటన అమెరికా అధ్యక్షుడు ప్రకటిం చటం దేశ చరిత్రలోనే మొదటిసారి. భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చి కాల్పుల విరమణ ప్రకటించేలా చేశానని అమెరికా అధ్యక్షుడు స్వయంగా ప్రకటించారు. దీనిపై ప్రధాని మోదీ మాట్లాడటం లేదు. అలాగే అమెరికాలో భారతీయులపై దురాగతాలు జరుగుతున్నా.. ట్రంప్‌తో మాట్లాడే ధైర్యం చేయటం లేదు' అని విమర్శించారు.

## శ్రీశైలం ప్రాజెక్టులో ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి

కర్నూలు: శ్రీశైల జలాశయం పరిధిలోని కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. మరోవైపు జలాశయంకు ఎగువ జూరాల నుంచి కృష్ణా ప్రవాహం కొనసాగుతుంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 885 అడుగులకు గానూ బుధవారం ఉదయం 6 గంటలకు 835.80 అడుగులుగా ఉంది. ఇక జలాశయంలో 215 టీఎంసీల నీటికి గాను 56.0840 టీఎంసీల నీళ్ల నిల్వ ఉన్నాయి. ఇక జలాశయంకు ప్రస్తుతం 12,672 క్యూసెక్కుల

## కాళేశ్వరం కమిషన్ ఎదుట ముగిసిన కేసీఆర్ విచారణ..



హైదరాబాద్,తెలంగాణకు కీలకమైన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో జరిగిన అన్యాయాలు, అవకతవకలపై విచారణకు ఏర్పాటు చేసిన కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరై 50 నిమిషాల పాటు విచారణ ఎదుర్కొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని ఈ కమిషన్ కేసీఆర్‌ను వన్ టూ వన్ గా విచారించింది. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన విచారణ 12:50 గంటలకు ముగిసింది. అనంతరం కేసీఆర్ బీఆర్కే భవన్ నుంచి బయటకు వచ్చి అక్కడ ఎదురుచూస్తున్న పార్టీ కార్యకర్తలకు అభివాదం చేశారు. ఈ విచారణ సందర్భంగా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ పత్రాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఫైల్ కమిషన్‌కు అందించారు. స్వల్ప అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కమిషన్‌కు తెలిపిన నేపథ్యంలో కమిషన్ కేసీఆర్‌ను ఓపెన్ కోర్టులో కాకుండా 'ఇన్ కెమెరా' విధానంలో విచారించింది. ఈ విధానంలో కమిషన్ ఛైర్మన్ ఘోష్, కేసీఆర్ మాత్రమే హాజరయ్యారు. మొత్తం విచారణను కెమెరాలో రికార్డు చేశారు. ఇంతకు ముందు మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్ రావులను కూడా కమిషన్ ఓపెన్ కోర్టులో విచారించిన విషయం తెలిసిందే. అయితే హరీశ్ రావు విచారణ అనుభవాన్ని తెలుసుకున్న కేసీఆర్ వ్యక్తిగతంగా కమిషన్ ఛైర్మన్‌ను కోరడంతో కమిషన్ ఓపెన్ కోర్టు విచారణను రద్దు చేసింది. విచారణలో ప్రాజెక్టు రీ ఇంజినీరింగ్, బ్యారేజీల నిర్మాణం, ఒప్పందాలు, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, నీటి నిల్వల అంశాలపై కేసీఆర్‌ను పీసీ ఘోష్ ప్రశ్నించారు. దీనికి కేసీఆర్ సమగ్రంగా సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం. ఈ దశలో కమిషన్ ఇప్పటి వరకు మొత్తం 115 మందిని విచారించింది. కాగా మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, సీపేజ్ సమస్యలతో సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది మార్చిలో ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి అధికారులే కాక నిర్మాణ సంస్థల ప్రతినిధులను కూడా విచారించింది. విచారణ ముగిసిన వెంటనే కేసీఆర్ నేరుగా యశోదా ఆసుపత్రికి వెళ్లారు. ఇటీవల సిద్ధిపేటలోని ఫాంహౌస్‌కు వెళ్లిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రమాదవశాత్తూ జారి పడడంతో తుంటి ఎముకకు గాయమైంది. ప్రస్తుతం ఆయన యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసీఆర్ ఆయన్ను పరామర్శించనున్నారు.

## సంపాదకీయం

గురువారం 12-06-2025

# అక్షర సంకల్పానికి తూట్లు !

ప్రతి ఆవాసంలోనూ స్కూలు పెట్టి పిల్లలకు విద్యను చేరువ చేయాలన్న సంకల్పం తో ఏర్పాటు చేసిన ఏకోపాధ్యా పాఠశాలలు కనుమరుగు అయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలను ఓ క్రమపద్ధతిలో ప్రైవేట్ పాఠశాలలు మింగేశాయి. దీంతో మారుమూల గ్రామాల ప్రజలకు ప్రైవేట్ స్కూళ్లు దిక్కయ్యాయి. వారు మెల్లగా గ్రామాలకు బస్సులను పెట్టి, మండల కేంద్రాల్లో స్కూళ్లు పెట్టి, అందమైన బొమ్మలు చూపి ముగ్గులోకి దించుతూ వచ్చారు. ఇలాగత దశాబ్దకాలంగా ప్రైవేట్ స్కూళ్ల విజృంభణతో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగు అయ్యాయి. ఉమ్మడి ఎపిలో ఇలా అనేక స్కూళు మూతపడ్డాయి. రాష్ట్ర విభజన తరవాత కూడా పాలకులు ఇదే ధోరణి అవలంబించడంతో అనేక పాఠశాలలు మూతపడ్డాయి. డిఎస్సీల గొడవ, జీతాల గొడవ లాంటివి లేకుండా చేసే కుట్రలో భాగంగా అనేక స్కూళ్లను మూసేశారు. ఘనత వహించిన తెలంగాణలో కెసిఆర్ సర్కార్ ఈ విషయంలో వడివడిగా అడుగులు వేసింది. అందుకే విద్యారంగంలో తీసుకున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రభావం చూపలేదు. పేదలకు విద్యు అందించాలన్న ఆలోచన లేకుండా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకున్నాయి. ఇంగ్లీష్ మీడియం ఆశ చూపి స్కూళ్ల విలీనంతో చిన్నపిల్లలు తమ సమీప స్కూళ్లకు వెళ్లే అవకాశం కోల్పోయేలా చేసిన ఘనతను నాటి సిఎం జగన్ సాధించారు. ఒకప్పుడు విద్యను గ్రామస్థాయికి తీసుకుని వెళ్లాలన్న సంకల్పంతో ఏకోపాధ్యాయ పాఠశాలలను ప్రారంభించారు. చిన్న గ్రామానికి కూడా స్కూలు ఉండాలన్న సంకల్పం వచ్చింది. అక్కడ ఒక్కరే టీచర్‌ను నియమించి నడిపించారు. దీంతో అనేక గ్రామాల్లో ఏకోపాధ్యాయ స్కూళ్లు ఏర్పడ్డాయి. తల్లిదండ్రులు తమపిల్లలను ఉన్న ఊర్లోని స్కూలుకు పంపడం వల్ల అక్షరజ్ఞానం వచ్చింది. ఇది అక్షరాస్యతకు తోడ్పడింది. అక్షరాస్యతను పెంచే క్రమంలో ఇదో విప్లవాత్మక చర్యగా చూడాలి. ఈ లక్ష్యం దెబ్బతినకుండా ప్రభుత్వాలు మరింత పకడ్బందీగా విద్యావ్యవస్థను అమలు చేయాల్సింది పోయి వాటిని మూతేశారు. ప్రభుత్వాలు జీతాల భారం తగ్గించుకునే క్రమంలో స్కూళ్ల విలీనం చర్యలకు పూనుకున్నాయి. దీనివల్ల సామాన్యులకు ప్రభుత్వ విద్య దూరం అయ్యింది. ఇది కూడా కార్పోరేట్ కుట్రలో భాగమే అని చెప్పాలి. వారు వెనకవుండి ఆడించిన కారణంగానే ప్రభుత్వాలు ఈ చర్యలకు దిగాయి. ఈ సమస్యను అర్థం చేసుకోకుండా ప్రాథమిక పాఠశాలలను.. ప్రాథమి కోన్నత, ఉన్నత విద్యాపాఠశాలల్లో విలీనం చేసారు. గతంలో పాలించిన జగన్ నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర నిరసన వ్యక్తం అయ్యింది. మా పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేయవద్దంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. నిజానికి ప్రతి గ్రామానికి పాఠశాల ఉండాలన్న సంకల్పం దెబ్బతనికుండా చూడాల్సిన ప్రభుత్వం విలీనం పేరుతో ఇలా చేయడంతో సామాన్యులకు విద్యను దూరం చేశారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే తంతు కొనసాగింది. ఇలా వందలాది పాఠశాలలను మూసివేశారు. ఇదంతా కుట్రపూరితంగా జరిగిన కార్యక్రమంగా గుర్తించాలి. దీంతో ప్రైవేట్ విద్యా సంస్థలు తమ విస్తరణకు అవకాశంగా తీసుకున్నాయి. గ్రామాలకు బస్సులను నడుపుతూ, మండల కేంద్రాల్లో స్కూళ్లను పెడుతూ, వాటిని పెంచుకుంటూ వచ్చారు. దీంతో విధిలేక తల్లిదండ్రులు ఇంటిముందుకు వచ్చే బస్సులో తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు. దీంతో వారిపై ఆర్థికభారం పడుతోంది. అనివార్యంగా ఇప్పుడు గ్రామాల్లో ప్రజలు తమ పిల్లను ప్రైవేట్ స్కూల్లకు బలిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం పెట్టాలన్న సంకల్పం మంచిదే అయినా గ్రామాలకు పాఠశాలలను దూరం చేయడం మాత్రం సరికాదు. ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం ద్వారా తమ పిల్లలు బడులకు దూరమవుతారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్న తీరు ప్రభుత్వం వెంటనే గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. సంస్కరణల పేరుతో పాఠశాలలను మూసివేస్తామంటే ఎలాగని గతంలోనే ఎపి హైకోర్టు నిలదీసింది. జాతీయ విద్యావిధానమంటూ విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఎలా చేపడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. విద్యాహక్కు చట్టం మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని పాటిస్తున్నట్లు కనిపించడం లేదని కూడా హైకోర్టు అభిప్రాయ పడింది. ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతోంది. సర్కారు చర్యలు విద్యా వ్యవస్థను బలపరిచేలా ఉండాలే కానీ నిర్వీర్యం చేసేలా ఉండకూడదని పాలకులగుర్తించడం లేదు. నూతన విద్యా విధానం అమలు పేరుతో పాఠశాల విద్య దెబ్బతినకుండా, పిల్లలకు పాఠశాలలు దూరం కాకుండా చూసుకోవాలి. పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ద్వారా స్కూళ్ల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేయరాదు. స్కూళ్లను పెంచి, సౌకర్యాలు కల్పించి, టీచర్లను పెంచడం ద్వారా మరింత పటిష్టంగా ప్రభుత్వ విద్య అమలయ్యేలా చూడాలి. ప్రభుత్వ అనాలోచిత చర్య కారణంగా చిన్నారులు, బాలికలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది. విద్యారంగం అన్నది ఏ రాష్ట్రానికైనా ప్రాధాన్యరంగం కావాలి. ఏకోపాధ్యా స్కూళ్లను మరింతగా మెరుగు పరచి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలి. దీంతో నిరుద్యోగ సమస్యా తీరవచ్చు. ఆర్థికంగా భారమైనా విద్యాయరంగానికి కేటాయింపులు పెంచి అనుత్పాదక రంగాలకు, ఉచితపథకాలకు కోతలు పెట్టాలి. అప్పుడే విద్యారంగం పటిష్టం కావడంతో పాటు..అక్షరాస్యతా ఉద్యమం ముందు సాగగలదు.

# 'హస్తం'లో అంతర్మథనం!

న్యూఢిల్లీ,రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ సర్వాధికారి.. అందులో సందేహం లేదు. ఇప్పుడే కాదు.. పార్టీలో ఆయనకు ఏ పదవీ లేనప్పుడు కూడా కాంగ్రెస్ నాయకులకు ఆయన మాటే వేదం. ఆయన నందంటే నంది పందంటే పంది. కాదని ఎవరైనా కాసింత తోక జాడిస్తే అంతే సంగతులు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రోజుల్లో అయితే చేప్పనే అక్కర లేదు. ఇటు పార్టీకి అటు ప్రభుత్వానికి ఆయనే 'బిగ్ బాస్'. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి అయితే.. రాహుల్ గాంధీ సూపర్ ప్రైమ్ మినిస్టర్ అన్నట్లు వ్యవహారం నడిచింది. ఒక చిన్న ఉదాహరణ చెప్పుకుందాం.. అందరికి తెలిసిన, బాగా గుర్తున్న విషయమే. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ఒకానొక ఆర్డినెన్సు రాహుల్ గాంధీకి నచ్చ లేదు. అందులో తప్పు లేదు. అది ఆయన విజ్ఞతకు సంబందించిన విషయం. ఆ ఒక్క ఆర్డినెన్సు అనే కాదు.. మరే ఆర్డినెన్సు లేదా చట్టం అయినా అందరికీ నచ్చాలని లేదు. నిజానికి.. ఆ ఆర్డినెన్సును ఆమోదించిన మంత్రి మండలిలోని మంత్రులు అందరికీ ఆ ఆర్డినెన్సు నచ్చిందని చెప్పలేము. అయి నా.. మంత్రి మండలి ఆమోదం పొందిన తర్వాత అందరూ ఆమోదించి నట్లే, భావించవలసి ఉంటుం ది. అందుకే మంత్రులే కాదు.. కాంగ్రెస్ ఎంపీలు ఎవరూ కూడా ఈ ఆర్డినెన్సు నాకు నచ్చలేదని బరబరా చించి పారేయలేదు. ఆ పని రాహుల్ గాంధీ చేశారు. అది కూడా.. ప్రధానమంత్రి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో. ప్రధానితో పాటుగా మొత్తంగా మంత్రివర్గాన్ని ప్రభుత్వాన్ని, పార్టీని అవమాన పరిచే విధంగా.. ఛీ నాన్సెన్స్ అంటూ మీడియా ఎదుట ఆర్డినెన్సు కాపీని పరపరా ముక్కలు ముక్కలుగా చించి పారేశారు.అయినా.. సోనియా, మన్మోహన్ సింగ్ సహా ఎవరూ పెదవి విప్పలేదు. ఇదేమిటని ప్రశ్నించలేదు. ఆ తర్వాత ఎప్పుడో మన్మోహన్ సింగ్ ఆ సమయంలో రాజీనామా చేయాలని అనుకున్నారనీ, ఎవరో వారిస్తే సర్దుకున్నారనే ప్రచారం జరిగింది. అయితే.. అది నిజమో కాదో తెలియదు. సరే.. ఆ విషయాన్ని అలా ఉంచితే కాంగ్రెస్ పార్టీ అనే కాదు, బీజేపీ సహా జాతీయ, ప్రాంతీయ పార్టీలు అన్నీ కూడా వ్యక్తి ఆరాధనకు అల వాటు పడ్డాయి. వ్యక్తి ఆధారిత పార్టీలుగా మారిపోయాయి. రాజకీయాలు వ్యక్తుల చుట్టూనే తిరుగు తున్నాయి. అయితే.. అన్ని పార్టీలు, అందరు నాయకుల కథ వేరు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ స్టోరీ వేరని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. నిజానికి గతంలో కాంగ్రెస్ సహా ఏ పార్టీలో అయినా ఎన్నికల గెలుపు ఓటముల లెక్కల ఆధారంగానే నాయకత్వ నిర్ణయం జరిగేది. ఎవరి దాకనో ఎందుకు.. అత్యవసర పరిస్థితి అనంతరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో,ఇందిరాగాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. జనతాపార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ వెంటనే కాంగ్రెస్ పార్టీలో తిరుగుబాటు వచ్చింది. ఇందిరా గాంధీ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ బ్రహ్మానంద రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ (ఆర్) పుట్టుకొచ్చింది. అయితే.. జనతా ప్రభుత్వంలో తలెత్తిన అంతర్గత కుమ్ములాటలను ఆసరా చేసుకుని ఇందిరాగాంధీ, కేవలం 11 నెలలకే తిరిగి అధికారంలోకి వచ్చారు. ఆ విధంగా ఆమె తమ నాయకత్వ సత్తాచాటుకుని పార్టీపై పట్టు సాధించారు. అలాగే.. అద్వానీ విషయంలో బీజేపీ ఆయన్ని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి రెండు (2004, 2009) ఎన్నికల్లో పోటీ చేసింది. రెండు ఎన్నికల్లోనూ ఓడి పోయింది. అందుకే, 2014 లో అద్వానీని తప్పించి, మోదీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి విజయం సాధించింది.ఇక మళ్ళీ రాహుల్ గాంధీ విషయానికి వస్తే.. రాహుల్ ప్రత్యక్ష పరోక్ష సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ వరసగా మూడు సార్వత్రిక ఎన్నికలలలో ఓడి పోయింది. అందులో రెండు సార్లు కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హెూదా కూడా దక్కలేదు. సీట్ల సంఖ్య, రెండు అంకెల సంఖ్యను దాట లేదు. మూడవ సారి, ప్రతిపక్ష హెూదా అయితే, దక్కింది కానీ సీట్ల సఖ్య మూడంకెలు చేరలేదు. 99 దగ్గరే ఆగిపోయింది. దేశ రాజధాని ఢిల్లీలో వరసగా మూడు అసెంబ్లీ, మూడు లోక్ సభ ఎన్నికలు మొత్తం కలిపి ఆరు వరస ఎన్నికల్లో కాంగ్రెస్ జీరో స్కోర్ హ్యాట్రిక్ సొంతం చేసుకుంది. అది కూడా ఒక సారి కాదు, వరసగా రండు జీరో హ్యాట్రిక్ లు సొంతం చేసుకుంది. మొత్తంగా చూస్తే.. రాహుల్ గాంధీ ప్రత్యక్ష , పరోక్ష సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 90 పైగా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడి పోయింది. అంతే కాదు.. రాహుల్ గాంధీ అపరిపక్వ రాజకీయాల కారణం గా పార్టీ మళ్లీ బతికి బట్ట కట్టలేనంత భారీ మూల్యం చెల్లించింది. అయినా.. కాంగ్రెస్ పార్టీ ఇంకా రాహుల్ గాంధీని మోస్తూనే వుంది. మరో వంక రాహుల్ గాంధీ ఇంకా అదే పంథాలో అడుగులు వేస్తున్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ కి గతమే కానీ, భవిష్యత్ లేదనీ.. ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడి, తదనం తర పరిణామాల నేపధ్యంలో రాహుల్ గాంధీ.. ఆయన చుట్టూ చేరిన కోటరీ నేతలు చేస్తున్న దేశ వ్యతిరేక వ్యాఖ్యలు, విమర్శలు కాంగ్రెస్ పార్టీ స్థాయిని మరింతగా దిగజార్చి వేయడంతో పాటుగా, ప్రజల్లో పార్టీ ప్రతిష్టను మరింతగా దిగజార్చి వేసిందని అంటున్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని, చివరకు ఇలా మిగిలాం ..అనే అంతర్మథనం మొదలైందని అంటున్నారు.



# తాత్కాలిక సారథ్యం... ఇష్టారాజ్యం



ఢాకా,విద్యార్థుల ఉద్యమంతో నిరుడు ఆగస్టులో షేక్ హసీనా సర్కారు గద్దె దిగినప్పటి నుంచీ పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో అస్థిరత రాజ్యమేలుతూనే ఉంది. ఒక సంక్షోభం నుంచి మరో సంక్షోభంలోకి ఆ దేశం ప్రయాణిస్తూనే ఉంది.విద్యార్థుల ఉద్యమంతో నిరుడు ఆగస్టులో షేక్ హసీనా సర్కారు గద్దె దిగినప్పటి నుంచీ పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో అస్థిరత రాజ్యమేలుతూనే ఉంది. ఒక సంక్షోభం నుంచి మరో సంక్షోభంలోకి ఆ దేశం ప్రయాణిస్తూనే ఉంది. ముఖ్యంగా బంగ్లా తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు తావిస్తోంది.బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా అధికారంలో ఉన్నప్పుడు యూనస్‌పై అనేక ఆర్థిక ఆరోపణలు వచ్చాయి. అవన్నీ ఆయన స్థాపించిన గ్రామీణ బ్యాంకు ఆర్థిక లావాదేవీలకు సంబంధించినవే. కొన్ని కేసుల్లోనైతే యూనస్‌కు కోర్టులు శిక్షలు కూడా వేశాయి. అనంతర పరిణామాల్లో 84ఏళ్ల యూనస్ అనూహ్యంగా బంగ్లాదేశ్ సారథి అయ్యారు. ఆర్థికవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత అన్న గౌరవానికి తోడు- ఏ పక్షానికీ కొమ్ముకాయకుండా తటస్థంగా వ్యవహరిస్తారన్న భావన కూడా ఆయన ఎంపికకు కారణమైంది. కానీ, పగ్గాలు చేపట్టినప్పటి నుంచి యూనస్ తీసుకుంటున్న నిర్ణయాల్లో భారత్ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. తమ దేశంలోని హిందువులపై మతఛాందసవాదులు దాడులు చేసినా ఆయన ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు.ఈ విషయంలో భారతదేశ ఆందోళనలనూ పరిగణనలోకి తీసుకోలేదు. బంగ్లాలో ఎవరు అధికారంలోకి వచ్చినా తొలి విదేశీ పర్యటనగా దిల్లీకి రావడం సంప్రదాయం. దానికి యూనస్ తిలోదకాలిచ్చి బీజింగ్‌కు వెళ్లారు. "మేము మీతో కలిసి పనిచేయాలనుకుంటున్నాం. మీ భాగస్వామిగా ఉంటాం" అని యూనస్ ఇటీవల చైనా నేతలకు బహిరంగ విజ్ఞప్తి చేశారు.

డ్రాగన్‌కు ప్రాజెక్టులు కట్టబెట్టి...

భారత్, చైనాలతో సంబంధాలకు హసీనా సమప్రాధాన్యం ఇచ్చేవారు. ఇండియా వ్యూహాత్మక ప్రయోజనాలకు భంగం కలగకుండా ఆమె వ్యవహరించారు. యూనస్ ఏమో భారత భద్రతకు ముప్పు తెచ్చే ప్రాజెక్టులను చైనాకు అప్పగించడం మొదలుపెట్టారు. బంగ్లాదేశ్‌లో రెండో అతిపెద్ద నౌకాశ్రయమైన మోంగ్లా ఆధునికీకరణ పనులను డ్రాగన్‌కు కట్టబెట్టారు. భారత్ భద్రతను తీవ్రంగా ప్రభావితం చేసే తీస్తా నది ప్రాజెక్టులోనూ బీజింగ్‌కు భాగస్వామ్యం కల్పించారు. ఈశాన్య రాష్ట్రాలతో మిగిలిన భారత్‌ను అనుసంధానించే సిలీగుఢీ నడవాకు సమీపంలోనే ఈ నది ఉంది. ఈ ప్రాజెక్టులోకి డ్రాగన్‌ను అడుగుపెట్టనీయొద్దని బంగ్లాకు భారత్ పదేపదే చెబుతూ వచ్చింది. తాజాగా లాల్ మోనిర్‌హాట్ వైమానిక స్థావరం ఆధునికీకరణ పనులనూ చైనాకు బంగ్లా అప్పగించనుందన్న వార్తలు కలవరపరుస్తున్నాయి. ఈ స్థావరం బెంగాల్‌లోని జల్పాయ్‌గుఢీకి సమీపంలోనే ఉంది. "ఈశాన్య రాష్ట్రాలు భూదిగ్బంధనంలో ఉన్నాయి. వాటికి సముద్రం అందుబాటులో లేదు. బంగ్లాదేశ్ మాత్రమే ఈ ప్రాంతంలో సముద్రానికి కావలి దారు" అంటూ యూనస్ చేసిన వ్యాఖ్యలు- భారత్‌పై ఆయనకున్న విద్వేషానికి నిదర్శనం. అమెరికాకూ యూనస్ అమ్ముడుపోయారని బంగ్లాలోని రాజకీయ పార్టీలే ఆరోపిస్తున్నాయి. ఇటీవల మయన్మార్‌లో ఘర్షణలు జరుగుతున్న రఖైన్ రాష్ట్రానికి బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్ నుంచి మానవతా నడవా ఏర్పాటు చేయాలన్న నిర్ణయం తీవ్ర అలజడి రేపింది. ఈ నడవాపై అమెరికన్ల పెత్తనం ఉంటుందనీ, అది దేశ భద్రతకు ముప్పు అని రాజకీయ పార్టీలు తీవ్ర అభ్యంతరం చెప్పాయి. సైన్యమూ తీవ్రంగా ప్రతిఘటించింది. దాంతో యూనస్ వెనక్కి తగ్గాల్సి వచ్చింది.

కక్ష సాధింపు ధోరణి...

దేశ తాత్కాలిక సారథిగా సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించడం యూనస్‌కు అప్పగించిన ప్రధాన బాధ్యత. ఇందులో భాగంగా ఎన్నికల సంస్కరణలు తెచ్చి స్వేచ్ఛగా, పారదర్శకంగా దేశంలో అన్ని పార్టీలు ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనేలా చేయాలి. కానీ, ఇంతవరకు అలాంటి చర్యలేవీ చేపట్టలేదు. పైగా హసీనా ప్రభుత్వం తనపై కేసులు బనాయించిందన్న కక్షతో ఆమె నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీకి చెందిన కీలక నేతలపై వందల సంఖ్యలో కేసులు పెట్టి, చాలామందిని జైళ్లకు పంపారు. ఈ ప్రతీకార ధోరణి ఎంతవరకు వెళ్లిందంటే, చివరికి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా ఆ పార్టీపై యూనస్ నిషేధం విధించారు. అదే సమయంలో కరడుగట్టిన మత ఛాందస పార్టీ, బంగ్లాదేశ్ 1971 స్వాతంత్ర్య ఉద్యమంలో పాకిస్థాన్‌కు మద్దతిచ్చిన జమాత్-ఎ-ఇస్లామీపై నిషేధం తొలగించారు! పోనీ ఎన్నికలైనా తొందరగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారా అంటే ఆ కార్యాచరణా ఎక్కడా కనిపించడం లేదు. ఈ క్రమంలో ఆ దేశ సైన్యాధ్యక్షుడు వకార్-ఉజ్-జమాన్ స్వయంగా రంగంలోకి దిగి, డిసెంబరుకల్లా ఎన్నికలు నిర్వహించాలని యూనస్‌కు అల్టిమేటం జారీ చేయాల్సి వచ్చింది. దాంతో ఆయన దిగివచ్చి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహిస్తామంటూ తాజాగా ప్రకటించారు. ఏదిఏమైనా చైనాతో యూనస్ అంటకాగుతున్న నేపథ్యంలో, భారత్ ఆచితూచి వ్యవహరించాలి. బంగ్లాలో ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేలా యూనస్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి తీసుకురావాలి. మరోవైపు, అక్కడి ప్రజాస్వామ్య పార్టీలతోనూ గట్టి సంబంధాలు ఏర్పరచుకోవాలి. గతంలోలా ఒకే పార్టీకి ఏకపక్షంగా మద్దతిచ్చే వైఖరిని న్యూదిల్లీ విడనాడాలి. మరీ ముఖ్యంగా చైనా ప్రభావానికి ఢాకా లోనుకాకుండా చూసుకోవడం అత్యావశ్యకం.

# జాతీయ మహిళా కమిషన్ చొరవ అభినందనీయం

అమరావతి, సాక్షి ఛానల్ చర్చలో అమరావతి మహిళలను ఉద్దేశించి జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నది. అమరావతిని వేశ్యల నగరంగా కృష్ణంరాజు అభివర్ణించారు.

దీంతో ఆంధ్రప్రదేశ్‌లో ఆగ్రహ జ్వాలలు రేకెత్తాయి. సాక్షి ఛానెల్‌పై, జర్నలిస్ట్ కృష్ణంరాజుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది. మహిళా కమిషన్ చొరవను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓట్వీట్ చేశారు. అమరావతి మహిళలను ఉద్దేశిస్తూ కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశించిన జాతీయ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహత్కర్‌కు అభినందనలు. అమరావతి మహిళా రైతులను వేశ్యలుగా అభివర్ణించడం సిగ్గుచేటు- మాత్రమే కాదు.. నేరం కూడా. ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సత్వరమే స్పందించి వేగంగా చర్య తీసుకోవడం ద్వారా అలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించేది లేదనే బలమైన సందేశం ఇచ్చింది. మేమంతా అమరావతి మహిళా రైతుల వెనుక ఉన్నాం. వారికి సత్వరమే న్యాయం జరగాలి అన్నారు.

# వరిరైతుకు కలసిరాని కాలం

గుంటూరు,వరి రైతుకు ఈ ఏడాది కాలం కలిసి రాలేదు. తెగుళ్లు, అధిక వర్షాలు, ఎలుకలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. మరోవైపు మద్దతు ధర లభించే పరిస్థితి కానరావడం లేదు. వర్షం.. తెగుళ్లు.. ఎలుకలు.. ఇలా ధాన్యం రైతును దెబ్బతీశాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసినా ఆశించిన దిగుబడులు రాక అన్నదాత అల్లాడుతున్నాడు. సాగు కష్టాలను అధిగమించి పండించిన ధాన్యానికి మార్కెట్‌లో మద్దతు గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌బీకేలో ధాన్యం కోనుగోళ్లకు ఏర్పాట్లు చేసినా శాంపిల్స్ స్థాయిలోనే ఉన్నాయి.నిబంధనలు పరిశీలిస్తే ధాన్యం విక్రయించుకునే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. యంత్రాలతో నూర్పిళు చేస్తున్నందున తేమ ఉంటుందన్నారు. అయితే 17 శాతం లోపే తేమ ఉండాలని మార్కెటంగ్ శాఖ షరతులు విధిస్తున్నది. దీనికి తోడు ట్రాన్స్‌ఫోర్టు ఖర్చులు, కాటా కూలి కలిపితే బస్తాకు వందకుపైగా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. షరతులు సడలించాలని, తేమను పరిగణనలోకి తీసుకోకుండా కోనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కూడా మద్దతు ధర అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు ఎకరాకు 5 నుంచి 10 బస్తాల వరకు దిగుబడులు తగ్గాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు మార్కెట్‌లో ధాన్యం ధర పతనమైంది. ఒకవైపు దిగుబడులు తగ్గడం.. మరోవైపు ధర పతనంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతుల నుంచి ధాన్యం కోనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందే కాని క్షేత్రస్థాయిలో చర్యలు లేవు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఏటా 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడులు ఉండేవని ఈ ఏడాది పది బస్తాల వరకు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి 37 వేల వరకు సాగు వ్యయమైందని.. ఈ పరిస్థితుల్లో అప్పులే మిగిలాయని వాపోతున్నారు. ఆర్‌బీకేలలో ఇంకా పూర్తి స్థాయిలో కోనుగోలు చేయడంలేదు. ధాన్యం ఆరబెట్టి తీసుకెళ్లడం సాధ్యం కాదని అంటున్నారు.

# మూడ్రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని డిజిపికి ఆదేశం

న్యూఢిల్లీ,అమరావతి మహిళలను ఉద్దేశించి సాక్షి ఛానెల్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీకి కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ లేఖ రాశారు. కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను ఎన్‌సీడబ్ల్యూ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించింది. అమరావతి ఉద్యమంలో మహిళా రైతులు కీలకపాత్ర పోషించారని మహిళా కమిషన్ పేర్కొంది. కృష్ణంరాజు వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా తీసుకుని మహిళా కమిషన్ విచారణకు ఆదేశించింది. అలాగే అసభ్య వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అమరావతిని 'వేశ్యల రాజధాని'గా సంబోధించడం అనేది రాజధాని ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించిన మహిళా రైతులను తీవ్రంగా అవమానించడమేనని జాతీయ మహిళా కమిషన్ పేర్కొంది. ఈ అసహ్యకరమైన, రెచ్చగొట్టే వ్యాఖ్యలను తీవ్రంగా జాతీయ మహిళా కమిషన్ ఖండిస్తోందని ఛైర్‌పర్సన్ విజయా రహట్కర్ అన్నారు. కాగా మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ప్రధాన నిందితుడైన కృష్ణంరాజు మూడు రోజుల కిందటే విజయవాడలోని తన ఇంటికి తాళం వేసి కుటుంబంతోపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతని కోసం మూడు ప్రత్యేక పోలీస్ బృందాలు వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నాయి. వేరే రాష్ట్రానికి వెళ్లి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలోనే కృష్ణంరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు జగన్ మీడియా తీరుపై ఏపీ వ్యాప్తంగా మహిళల నిరసనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి.

# డిజిపికి రఘురామ లేఖ...

అమరావతి, రాజధాని ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. కుల వివక్షకు సంబంధించిన పదం వాడిన సజ్జలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన దూషణలు అమరావతిలోని వేలాది మంది మనోభావాలను దెబ్బతీశాయని.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవమానకర భాషను ఎవరూ వాడకుండా చర్యలు తీసుకోవాలని రఘురామ కోరారు. అమరావతి మహిళలపై సాక్షి ఛానెల్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న మహిళలను ఉద్దేశించి సజ్జల నోరు పారేసుకున్నారు. వైకాపా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పిశాచాలు కూడా ఇలా చేయరేమో? వారిని రాక్షసులు అని కూడా అనలేం. అందరూ కలిసి సంకరం అయినట్టుంది. ఇవన్నీ కలిసి తయారైన తెగ ఏదో ఒకటున్నట్టుంది. ఆ తెగ పూనుకుంటే మాత్రమే ఇలా చేయగలదు. పూర్తిగా సమన్వయంతో కమ్ముకుని కొట్టాలని ప్రయత్నిస్తోంది. ఇవేవీ సహజమైనవి కావు, వ్యవస్థీకృతంగా చేస్తున్న నిరసన ప్రదర్శనలే అని సజ్జల వ్యాఖ్యానించారు.

# జల్సాల కోసం దొంగతనాలు

మెదక్, పనీపాటా లేకుండా జల్సాలు చేయడం కోసం దొంగతనాలను కొందరు ఎంచుకుంటున్నారు. చైన్ స్నాచింగ్స్, ఇళ్లలో చోరీలు చేస్తూ అందిన కాడికి దోచుకుంటు-న్నారు. పురుషులతో పాటు- కొందరు మహిళలు కూడా దొంగతనాలకు పాల్పడుతున్నారు. అయితే తాజాగా ఓ విచిత్ర దొంగల బండారం బయటపడింది. సహజీవనం చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ ప్రేమికులు దొరికి పోయారు. ఈజీ మనీకి అలవాటు- పడి దొంగతనాలను వృత్తిగా ఎంచుకుని చోరీలు చేస్తున్నారు. ఈ ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. బెట్టింగ్ లకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్న వీరిని మెదక్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. పెంట(30), వరలక్ష్మి(30) సహజీవనం చేస్తూ దొంగతనాలు చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం బయట తిరగడానికి కామారెడ్డి జిల్లాలో పల్సర్ బైక్ చోరీ చేసింది ఈ జంట. ఈ నెల 7న గజ్వేల్ బస్టాండ్ లో ఒంటరిగా ఉన్న మహిళను టార్గెట్ చేసి మాయమాటలు చెప్పి బైక్ పై ఎక్కించుకున్నారు ప్రియుడు, ప్రియురాలు. తర్వాత పరికిబండ వద్ద మహిళకు మద్యం తాగించి మత్తులో దించి ఒంటిపై నగలు ఎత్తుకెళ్లారు. ఈ క్రమంలో దండుపల్లి వద్ద పోలీసుల వాహన తనిఖీల్లో దొంగ ప్రేమికులు పట్టుబడ్డారు. నిందితుల నుంచి 1.25 తులాల బంగారం, 50 తులాల వెండి, పల్సర్ బైక్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తూప్రాన్ డిఎస్పీ నరేందర్ గౌడ్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

# నివురుగప్పిన నిప్పు...

## అధికారిక కార్యక్రమంగా కూటమి ఏడాది పాలన

అమరావతి,కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా సుపరిపాలన- స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 12న గురువారం సాయంత్రం ఈ వేడుకలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, అఖిలభారత సర్వీసు అధికారులతో కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు- చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయి.. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. దీనిపై కీలక ఉత్తర్వులు జారీ చేసింది ఏపీ సర్కార్.. రాష్ట్ర స్థాయి వేడుకగా కూటమి ఏడాది పాలన నిర్వహించాలని నిర్ణయించారు.. జూన్ 12వ తేదీన సాయంత్రం ఈ వేడుకలు నిర్వహించనున్నారు.. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆల్ ఇండియా ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని నిర్వహించాలని స్పష్టం చేసింది.. దీనికి సంబంధించిన తగిన ఏర్పాట్లు- చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది కూటమి సర్కార్.. 'సుపరిపాలన.. స్వర్ణాంధ్రప్రదేశ్' పేరుతో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు.. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు.. ఐఏఎస్ అధికారులు, ఐపీఎస్ అధికారులు పాల్గొంటారని ఉత్తర్వుల్లో పేర్కొంది. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి జూన్ 12 నాటికి ఏడాది పూర్తి కానుంది. దీనిని ప్రభుత్వం ఒక వేడుకలా ఈ కార్యక్రమం నిర్వహించనుంది.. ఈ కార్యక్రమంలో సీఎం,డిప్యూటీ- సీఎం, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొంటారు..ఎంపీలు.. కేంద్ర మంత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు..ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేకంగా ఈ సమావేశంలో వివరించనున్నారు.

## మహిళలపై సజ్జల వ్యాఖ్యలు దారుణం

అన్నమయ్య,అమరావతి మహిళలపై వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళలను కించపరుస్తూ సజ్జల ఒక మూర్ఖుడిలా మాట్లాడారని మండిపడ్డారు. వైకాపా చేసిన తప్పునే మళ్లీ మళ్లీ చేస్తోందన్నారు. సజ్జల కుమారుడు భార్గవ్‌రెడ్డి సోషల్‌మీడియాను అడ్డుపెట్టుకొని నాపై కూడా దుష్ప్రచారం చేశారు. వైఎస్ కుమార్తె, ఒక మహిళ అని కూడా చూడకుండా కించపరిచారు. జగన్ అందరినీ నా అక్కాచెల్లెళ్లు అంటారు.. కానీ, ఆయన సొంత చెల్లికే మర్యాద లేదు. ఇక రాష్ట్రంలోని మహిళలను ఏం గౌరవిస్తారని విమర్శించారు. ఏపీ మహిళలను ఉద్దేశించి వైసీపీ నేత సజ్జల రామకృష్ణా రెడ్డి చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. సజ్జల వ్యాఖ్యలను ప్రతీ ఒక్కరూ ఖండిస్తున్నారు. తాజాగా వైసీపీ నేత చేసిన కామెంట్స్‌పై వైఎస్ షర్మిలా రెడ్డి స్పందిస్తూ.. మహిళల మీద సజ్జల రామకృష్ణా రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నా మన్నారు. మూర్ఖుడిలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళలను పిశాచులతో పోల్చుతారా.. మహిళలను రాక్షసులు అంటారా అంటూ ఫైర్ అయ్యారు. సంకర జాతి అని మహిళలను అవమానిస్తారా అని అన్నారు. చేసిన తప్పుకి క్షమాపణ చెప్పడానికి ఎందుకు నామోషీ అని ప్రశ్నించారు. వైసీపీ చేసిన తప్పును మళ్ళీ మళ్ళీ చేస్తోందన్నారు. ఇదే సజ్జల కొడుకు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని తనను కూడా వదిలి పెట్టలేదన్నారు. సైతాన్ సైన్యంతో తన మీద తప్పుడు ప్రచారం చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ బిడ్డ అని,ఒక మహిళా అని చూడకుండా కించపరిచారని అన్నారు. జగన్ నా అక్క చెల్లెళ్ళు అంటారని.. కానీ జగన్ సొంత చెల్లికే మర్యాద లేదని.. ఇక రాష్ట్రంలో వీళ్ళు మహిళలకు ఏం గౌరవం ఇస్తారు అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మహాసముద్రమన్నా రు. సముద్రంలో మంచితో పాటు చెత్త కూడా ఉంటుందని తెలిపారు. అప్పుడప్పుడు చెత్త పైకి వస్తుందన్నారు. పార్టీ అభివృద్ధి చెందుతుంటే లాగే వాళ్ళు కూడా ఉన్నారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. పార్టీకి క్రమశిక్షణ కమిటీ ఉందని.. అటు-వంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటా మని తెలిపారు. పార్టీపై దుష్ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని వైఎస్ షర్మిలా రెడ్డి హెచ్చరించారు.

## అసలు కారణాలు ఇవే?

కడప : కడప జిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న చరిత్ర సుగవాసి కుటుంబానిది.. సుగవాసి బాలసుబ్రమణ్యం తండ్రి తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యే, ఎంపీగా సేవలందించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి సుబ్రమణ్యం ఓటమి పాలయ్యారు. అలాంటి కుంటుంబం నేడు పార్టీలో ఎదరవుతున్న అవమానాలు, వర్గపోరు భరించలేక రాజీనామా చేస్తున్నట్లు అధినేతకు లేఖ రాయడం జిల్లా రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. సుదీర్ఘ రాజకీయం అనుభవం కలిగిన ఆ కుటుంబం అసలు టీడీపీకి ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చింది? వారి భవిష్యత్తు ప్రణాళిక ఏంటి?ఉమ్మడి కడప జిల్లాలో సుగవాసి పాలకొండ్రాయుడు అంటే తెలియని వారుండరు.. అన్న ఎన్టీఆర్ కంటే ముందే రాజకీయ ఆరంగ్రేట్రం చేసి 1978లోనే తొలి సారి రాయచోటి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ పిలుపుతో తెలుగు దేశం పార్టీలో చేరి జిల్లా రాజకీయాల్లో తనదైన మార్క్ చూపించారు. పాలకొండ్రాయుడు నాలుగు సార్లు రాయచోటి నుంచి ఎమ్మెల్యేగా, ఒకసారి రాజంపేట ఎంపీగా గెలిచారు . తండ్రి వారసత్వం అందిపుచ్చుకుని రాజకీయాల్లోకి వచ్చిన సుగవాసి బాలసుబ్రమణ్యం రాజంపేట నుంచి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.సుగవాసి బాలసుబ్రమణ్యం ఒకసారి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా పని చేశారు. అలాంటి సుగవాసి కుటుంబం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రజల అభిప్రాయాలు, సూచనలు, మనోభావాల మేరకు తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సుగవాసి బాలసుబ్రమణ్యం టీడీపీ అధినేత చంద్రబాబుకు లేఖ రాశారు . రెండు రోజుల క్రితం తండ్రి సంస్మరణ సభలో కూడా ఆయన తమ్ముడు సుగవాసి ప్రసాద్ బాబు టీడీపీలో విభేదాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు.సుగవాసి కుటుంబం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయడం వెనుక పార్టీలో అంతర్గత విభేదాలే కారణం అంటున్నారు వారి అనుచరులు. గత ఎన్నికల్లో రాజంపేట నుంచి పోటీ చేసిన బాలసుబ్రమణ్యం ఓటమికి పార్టీలో ఓ సామాజిక వర్గం నేతలు వెన్నుపోటే కారణమని ఆరోపిస్తున్నారు. రాజంపేట టీడీపీలో ఆ సామాజికవర్గం నేతలు వైసీపీ అభ్యర్థితో కుమ్మక్కు అయ్యారని రాజంపేటలో జోరుగా ప్రచారం సాగింది. ఇక కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా నియోజకవర్గం ఇన్చార్జ్ విషయంలో విభేదాలు తీవ్ర స్థాయికి చేరాయట.నియోజకవర్గ లో జరుగుతున్న పరిణామాలపై అధినేతకు విన్నవించినా లైట్ తీసుకున్నారని సుగవాసి తీవ్ర అసంతృప్తి కి లోనయ్యారట. గత కొంత కాలంగా తమ భవిష్యత్తు పై అంతర్మధనం చెందుతూ చివరికి రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల తండ్రి సంస్మరణ సభలో సుబ్రమణ్యం తమ్ముడు ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. పార్టీ ఏదైనా వచ్చే ఎన్నికల్లో సుగవాసి కుటుంబం రాయచోటి నుంచి పోటీలో ఉంటుందని ఆయన ప్రకటించారు. దాంతో సుగవాసి కుటుంబం తెలుగుదేశంపై పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

న్యూఢిల్లీ,తుపాను ముందర ప్రశాంతత అంటే ఇదేనేమో! కొద్దివారాలుగా మణిపుర్ కొంత ప్రశాంతంగా ఉందని భ్రమిస్తున్నంత సేపు పట్టలేదు... ఆ రాష్ట్రం మరోసారి భగ్గుమంది. గత రెండేళ్ళుగా జాతి ఘర్షణల మధ్య చిక్కుకొని విలవిలలాడుతున్న ఈశాన్య రాష్ట్రం మళ్ళీ పతాక శీర్షికలకు ఎక్కింది. 2023 అల్లర్ల వేళ అనేక నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలను ఎదుర్కొంటున్న మైతేయ్‌ల ర్యాడికల్ సంస్థ 'అరంబై తెంగోల్' (ఏటీ) నేత కనాన్ సింగ్‌ను సీబీఐ అరెస్ట్ చేయడంతో ఆదివారం ఉద్రిక్తత పెచ్చరిల్లింది. భగ్గుమన్న నిరసనల మధ్య రాష్ట్రంలో పలుచోట్ల కర్ఫ్యూ, అయిదు రోజుల పాటు ఇంటర్నెట్‌పై నిషేధం విధించాల్సి వచ్చింది. వివిధ పార్టీల ఎమ్మెల్యేలు 23 మంది ఆదివారం వెళ్ళి, గవర్నర్‌ను కలసి పరిస్థితిని వివరించి, సామరస్యపూర్వక పరిష్కారానికై అర్థించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వెరసి, కేంద్రం సుదీర్ఘ జాప్యం తర్వాత ఫిబ్రవరిలో ఎట్టకేలకు అసమర్థ బీరేన్ సింగ్ సర్కార్‌ను తప్పించి రాష్ట్రపతి పాలన విధించిందన్న మాటే గానీ, మణిపుర్‌ను యథాపూర్వ స్థితికి తీసుకురాలేకపోయింది. తాజా పరిణామాలే అందుకు నిలువెత్తు నిదర్శనం. మైతేయ్‌లకు ఎస్టీ హోదాను ఇవ్వడాన్ని కుకీ వర్గ ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించడం రెండేళ్ళ క్రితం జాతుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఆర్థిక ప్రయోజనాలు, భూయాజమాన్యంపై అసలే దీర్ఘకాలంగా రెండు వర్గాల మధ్య నెలకొన్న అసంతృప్తి ఆ తాజా పరిణామంతో మరింత చిచ్చు రేపింది. అలా 2023 మే 3 నుంచి రాష్ట్రం అక్షరాలా తగలబడుతూనే ఉంది. ఈ ఘర్షణల వల్ల 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. బీరేన్ సింగ్ సారథ్యంలోని అప్పటి బీజేపీ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల రీత్యా ఒక వర్గానికి కొమ్ము కాస్తూ, పక్షపాతధోరణితో వ్యవహరించినట్టు ఆది నుంచీ ఆరోపణలున్నాయి. చివరకు భద్రతా దళాలు సైతం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడినట్టు వార్తలొచ్చినసంగతి మర్చిపోలేం. ప్రజలు, ప్రతిపక్షాల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా, బీరేన్‌ను మార్చడానికి ఇష్టపడని బీజేపీ అధిష్ఠానం తీరా గత ఫిబ్రవరిలో ఆయనను పక్కకు తప్పించినా పుణ్యకాలం గడిచిపోయింది. 2022 ఫిబ్రవరి నాటి ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ మద్దతు కూడగట్టుకొని అధికారం చేపట్టినా, పట్టుమని పదిహేను నెలలకే రాష్ట్రంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. మొత్తం 60 మంది సభ్యు లున్న మణిపుర్ అసెంబ్లీలో నిజానికి బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలున్నారు. రాష్ట్రం అతలాకుతల మవుతున్న వేళ... బీరేన్ స్థానంలో అన్ని వర్గాలకూ అనుకూలుడైన కొత్త వ్యక్తిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టి, రాష్ట్రపతి పాలనను నివారించి ఉండవచ్చు. కానీ, సీఎం అభ్యర్థిపై సొంత పార్టీలోనే ఏకాభిప్రాయం కుదరలేదు. పైగా, కుకీజో వర్గానికి చెందిన పార్టీ ఎమ్మెల్యేలు ఏడుగురు ఘర్షణలు మొదలైన నాటి నుంచి సభకు దూరంగా ఉండడం ఆ పార్టీకి తలనొప్పిగా తయారైంది. చివరకు, ఘర్షణలు మొదలైన 21 నెలల తర్వాత రాష్ట్రపతి పాలనే శరణ్యమైంది. కానీ, అప్పటికే చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టయింది. ఈశాన్య భారత అభివృద్ధికి తామే బాటలు వేస్తున్నామంటున్న పాలక పార్టీ మణిపుర్ వ్యవహారాన్ని సరైన రీతిలో చక్కదిద్దలేకపోయిందన్న శాశ్వత అప్రతిష్ఠను మూటగట్టుకోవాల్సి వచ్చింది. రాష్ట్రపతి పాలన విధించినా,



పర్వత ప్రాంత రాష్ట్రంలో పరిస్థితి నేటికీ నివురు గప్పిన నిప్పులానే ఉందని శని, ఆదివారం నాటి ఘటనలు మరోమారు ఋజువు చేశాయి.అక్కడి ఉద్రిక్తతను ప్రపంచానికి నివేదిస్తున్న విలేఖరులు సైతం శనివారం భద్రతా బలగాల దాడికి గురయ్యారు. పాత్రికేయులపై రాష్ట్రంలో పదే పదే జరుగుతున్న దాడులకు నిరసనగా చివరకు సోమవారం మణిపుర్‌లోని ప్రధాన పత్రికలన్నీ తమ పేపర్‌లో సంపాదకీయ స్థానాన్ని ఖాళీగా వదిలేశాయి. పత్రికలన్నీ సమష్టిగా నిలిచి ఇలా అరుదైన రీతిలో తమ నిరసన తెలియ జేయడం ఓ బలమైన సందేశం. మణిపుర్‌లో ఇప్పటికీ మామూలు పరిస్థితులు లేవనడానికి ప్రతీక. అసలు రెండేళ్ళ క్రితం ఘర్షణలు చెలరేగగానే ఆ ఏడాది జూన్ 4న కేంద్రం ముగ్గురు సభ్యుల విచారణ సంఘం వేసింది. పదే పదే పొడిగింపుల ప్రహసనంతో సదరు సంఘం కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ దాకా దేకింది. అప్పటికైనా ఆ సంఘం కొత్తగా తేల్చేదేమిటో, దాని నివేదికతో ఒరిగేదేమిటో చెప్పలేం. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలిందని 2023 ఆగస్టులో సుప్రీమ్ కోర్ట్ వ్యాఖ్యానించినా మన ఏలికలకు చీమ కుట్టినట్టయినా లేదు. నష్టనివారణలో చిత్తశుద్ధి కరవైంది. రాష్ట్రపతి పాలనతో పరిస్థితి మెరుగువతుందనుకుంటే అడియాసైంది. గవర్నర్ సైతం ఇంఫాల్ విమానాశ్రయం నుంచి ఇంటికి హెలికాప్టర్‌లో వెళ్ళాల్సిరావడం దిగ్భ్రాంతికరం. సాక్షాత్తూ బీజేపీ ఎంపీ ఒకరు 2020లో స్థాపించిన 'ఏటీ' సాయుధ పౌరసైన్యంగా మారి హింసకు పాల్పడి, ఆయు ధాలను కొల్లగొట్టినట్టు కథనం. ఎవరెన్నిమార్లు అభ్యర్థించినా, ఇప్పటికీ ఆయుధాలను అప్పగించ లేదు. రేపు అవి మరే నేరగాళ్ళ చేతిలో పడి, ఎక్కడకు దారి తీస్తాయో ఊహించలేం. గతంలో పలు తీవ్రవాద వర్గాలు నిషేధానికి గురైనా, ఇప్పటికీ ఏటీని ఎందుకు నిషేధించలేదంటే జవాబూ లేదు. ఇంత జరుగుతున్నా ప్రధాని పెదవి విప్పకపోవడం, ప్రపంచమంతా తిరుగుతున్నా ఈశాన్యంలో పర్యటించి భరోసా ఇవ్వకపోవడం సమర్థించలేం. ఇప్పటికైనా తీవ్రతను గుర్తించి, విభిన్న వర్గాల మధ్య సామరస్యానికి కృషి చేయాలి. హింస కన్నా అభివృద్ధి ముఖ్యమని నచ్చజెప్పాలి. వేలాది సగటు మణిపురీలు అనేక నెలలుగా శరణార్థి శిబిరాల్లో తలదాచుకోవాల్సి రావడం అన్ని పార్టీల సమష్టివైఫల్యం. ఇది ఇలాగే కొనసాగితే మానవత్వానికే మాయనిమచ్చ. దేశసమగ్రతకే ప్రమాదం.

## గుంటూరు మాజీ మేయర్ మనోహర్‌నాయుడు కేరీర్ క్లోజేనా?



గుంటూరు:ఎప్పుడైతే వైసీపీ ప్రభుత్వం పడిపోయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పరిస్థితులు చాలా వేగంగా మారుతున్నాయి. అందులోనూ గుంటూరులో ఈ వేగం మరింత ఎక్కువగా ఉంది. 2024 ఎన్నికలకు ముందు వరకూ గుంటూరు జిల్లాలో వైసీపీ అత్యంత బలమైన పార్టీగా ఉండేది. ఆ సమయంలో మనోహర్ నాయుడు కూటమి పార్టీలను, అందులోని నేతలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించేవారు. అప్పుడు గుంటూరు జిల్లాలోని వైసీపీ ముఖ్య నేతల జాబితాలో ఆయన పేరు కూడా ఉండేది. ముఖ్యంగా జనసేనపై అయితే ఆయన విమర్శల ధాటి చాలా తీవ్రంగా ఉండేది. మనోహర్ నాయుడు అప్పటి విపక్ష నేతలకు అల్టిమేటమ్‌లు ఇస్తూ తొడలు కూడా కొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ సమయంలో మనోహర్ నాయుడు పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి మాట్లాడిన మాటలు.. జనసేన నేతలతో వ్యవహరించిన తీరు రాష్ట్రంలోనే ఓ సంచలనంగా మారింది.ముఖ్యంగా జనసేనాని పవన్‌పై అయితే మనోహర్ నాయుడు తీవ్ర విమర్శలు చేశారు. అదే ఆయనకు ప్లస్ అయింది. గుంటూరు మేయర్‌గా ఉన్న ఆయన్ని జగన్ చిలకలూరిపేట నియోజకవర్గానికి ఇన్చార్జిగా నియమించారు. ఎన్నికల సమయంలో మనోహర్ నాయుడుకి వైసీపీ అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. 2024 ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి మనోహర్ నాయుడు పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి సీన్ మారిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో గుంటూరు రాజకీయాల్లో అత్యంత కీలకమైన మార్పులు జరిగాయి. చాలామంది వైసీపీని వీడి కూటమి పార్టీల వైపు అడుగులు వేశారు. గుంటూరు కార్పొరేటర్లు పలువురు తెలుగుదేశం, జనసేన కండువాలు కప్పుకున్నారు. ఈ దెబ్బతో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఉన్న కావటి మనోహర్ నాయుడు.. తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఎలాగైనా తనను ఇబ్బంది పెడతారనీ, వాళ్లు తనని తొలగించే ముందే.. తానే తప్పుకుంటే బెటర్ అని మనోహర్ నాయుడు మేయర్ పదవికి రాజీనామా చేశారు. అదే ఇప్పుడు వైసీపీ నుంచి ఆయన్ని సస్పెండ్ చేసే పరిస్థితికి తీసుకొచ్చింది. మనోహర్ నాయుడు రాజీనామాకు ముందు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కి సంబంధించి వైసీపీ అధ్యక్షుడు జగన్ నేతలందరినీ తాడేపల్లి పిలిపించుకొని మాట్లాడారు. అయినా మనోహర్ నాయుడు కనీసం అధిష్టానానికి చెప్పకుండా తన రాజీనామాన్ని ప్రకటించారు. రాజీనామా నిర్ణయంతో వైసీపీ నేతలు అంతా ఒక్కసారిగా షాక్ అవ్వాల్సి వచ్చింది. మనోహర్ నాయుడు తన నిర్ణయాలన్ని ముందుగా పార్టీ పెద్దలకు వివరించి, వారి ఆదేశాల మేరకు రాజీనామా చేసి ఉంటే బాగుండేదని కొందరు నేతలు బహిరంగంగానే తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబుతో సైతం మనోహర్ నాయుడు అంటీ ముంటన్నట్లు వ్యవహరిస్తున్నారంట. మేయర్ పదవికి రాజీనామా తర్వాత గుంటూరు వెస్ట్ నియోజవర్గ వైసీపీ ఇన్చార్జిగా తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారంట. అయితే వెస్ట్ నియోజవర్గానికి ఇన్చార్జిగా అంబటి రాంబాబు తనకు తానే ప్రకటించుకోవటంతో మనోహర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారంట. అందుకే పార్టీ చేపట్టిన వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమానికి సైతం మనోహర్ నాయుడు దూరంగా ఉండిపోయారు. ఆ క్రమంలో పార్టీ పెద్దలు ఆయన్ని సస్పెండ్ చేశారంట.ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతానికి మనోహర్ నాయుడి రాజకీయ భవిష్యత్ సందిగ్ధంలో పడ్డట్టే కనిపిస్తోంది. మనోహర్ నాయుడుని ప్రస్తుతం వైసీపీ నుంచి బయటకు పంపారు. ఆయన కూటమిలోని ఏ పార్టీలో చేరే పరిస్థితి లేదు. తెలుగుదేశం, జనసేన నేతలు ఎవరూ కూడా మనోహర్ నాయుడు ఎంట్రీని అంగీకరించే పరిస్థితి లేదు. దీంతో మనోహర్‌నాయుడు పొలిటికల్ కెరీర్‌కు ఎండ్ కార్డ్ పడినట్లే అన్న టాక్ వినిపిస్తోంది.

## చట్టవిరుద్ధమైన వారికి యూఎస్‌లో ప్రవేశం లేదు

న్యూఢిల్లీ,భారతీయ విద్యార్థి పట్ల అమెరికా అధికారులు ప్రవర్తించిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమవుతున్న వేళ అమెరికన్ ఎంబసీ దీనిపై వివరణ ఇచ్చుకుంది. న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగిన అతడ్ని సెక్యూరిటీ అధికారులు అడ్డుకున్నారు. తలను నేలకేసి నొక్కిపెట్టి హింసించారు. ఇదుకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. ఈ ఘటనను భారతీయులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన నేపథ్యంలో భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధమైన ప్రయాణికులను అమెరికా స్వాగతిస్తూనే ఉంటుందని పేర్కొంది. అయితే, చట్టవిరుద్ధమైన వారికి తమ దేశంలోకి ప్రవేశించే హక్కు లేదని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. 'మా దేశంలోకి వచ్చే చట్టబద్ధమైన ప్రయాణికులను అమెరికా స్వాగతిస్తూనే ఉంటుంది. అయితే, చట్టవిరుద్ధమైన వారికి యూఎస్‌ను సందర్శించే హక్కు లేదు. అక్రమ ప్రవేశం, వీసాల దుర్వినియోగం, యూఎస్ చట్టాలను ఉల్లంఘించడాన్ని మేము సహించము. వారిని మా దేశంలోకి అనుమతించబోము' అని భారత్‌లోని యూఎస్ ఎంబసీ తన టీ-÷-వట్‌లో పేర్కొంది. ప్రస్తుతం ఈ టీ-÷-వట్ వైరల్ అవుతోంది.కాగా, రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఆ దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి స్వదేశాలకు పంపుతున్నారు. ఈ క్రమంలో భారత్‌కు చెందిన ఓ విద్యార్థి న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే అక్కడి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నేలపై పడుకోబెట్టి, చేతులకు బేడీలు వేశారు. వీసా రద్దయిందని, చట్ట వ్యతిరేకంగా అమెరికాలోకి ప్రవేశించావని చెప్తూ తిరిగి వెనక్కి పంపించారు. ఎయిర్‌పోర్ట్‌లో ఈ వీడియో తీసిన కునాల్ జైన్ అనే ప్రవాస భారతీయుడు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు. సదరు విద్యార్థి మాటతీరు చూస్తుంటే హర్యానాకు చెందిన వ్యక్తిగా అనిపించాడని పేర్కొన్నాడు. కలలను సాకారం చేసుకోవడానికి వచ్చానని, ఎవరికీ హాని తలపెట్టేందుకు రాలేదని.. విద్యార్థి బోరున విలపిస్తున్నా పట్టించుకోకుండా నేరస్థుడి పట్ల వ్యవహరించినట్టు- ప్రవర్తించారని చెప్పాడు.

## భార్యపై అనుమానంతో హత్య

హైదరాబాద్,కలకాలం తోడు నీడగా ఉండాల్సిన భర్త అనుమానంతో భార్యను కడతేర్చాడు. వివాహేతర సంబంధం ఉందనే కారణంతో భార్యను చున్నీతో ఉరివేసి చంపాడు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ సరూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. భార్యను చంపిన తర్వాత భర్త పోలీసులకు లొంగిపోయాడు. తన భార్యను తానే చంపినట్లు పోలీసులకు చెప్పాడు. కేసు నమోదు చేసుకున్న సరూర్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. తూర్పుగోదావరి కొమ్మనపల్లికి చెందిన భార్య భర్తలు మరియాదాస్, అమృత పొట్టకూటికోసం హైదరాబాద్ వచ్చారు. గత మూడేళ్లుగా సరూర్‌నగర్‌లో ఉంటున్నారు. వివాహేతర సంబంధాలపై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. మంగళవారం అమృత ఫోన్ మాట్లాడుతుండగా.. మరియాదాస్ గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య గొడవ పెద్దది కావడంతో మరియాదాస్ కోపోద్రిక్తుడయ్యాడు. మెడకు చున్నీ బిగించి భార్య అమృతను చంపేశాడు. అమృతను చంపిన తర్వాత మరియాదాస్ నేరుగా సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి మరియాదాస్‌ను అరెస్ట్ చేశారు.

## హైదరాబాద్‌కు పేరు తెచ్చేల బోనాల నిర్వహణ

హైదరాబాద్,నగరంలో ప్రసిద్ధి చెందిన ఆషాఢ పండుగ బోనాల ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో బోనాల ఉత్సవాలపై మంగళవారం అన్ని విభాగాల అధికారులతో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్లఉ సమీక్షించారు. బోనాల పండుగ కోసం ప్రభుత్వం రూ. 20 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా గత ఏడాది బోనాల పండుగ జరుపుకున్నామని, ఒకటి రెండు చోట్ల ఇబ్బందులు తలెత్తాయని.. ఈ సారి ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. వీఐపీ మూమెంట్‌లో తొక్కిసలాటలు జరుగుతున్నాయని, అవి జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు- చెప్పారు. జోగినీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. గతంలో జరిగిన దానికంటే ఇంకా మంచిగా బోనాల ఉత్సవాలు జరపాలని అనుకుంటున్నామని మంత్రి కొండా సురేఖ చెప్పారు. సరస్వతి పుష్కరాలు కూడా అద్భుతంగా నిర్వహించామని.. పక్క రాష్ట్రాల భక్తులు కూడా ఎంతో అభినందించారని అన్నారు. అధికారులు సమన్వయంతో ఉండి డ్యూటీ చేయాలని.. సంయమనం పాటించాలని కోరుతున్నామన్నారు. భక్తులతో దురుసుగా ప్రవర్తించకుండా మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ దర్శనం చేయించాలన్నారు. గత ఏడాది బోనాల సమయంలో పొన్నం ప్రభాకర్ వీడియో వైరల్ అయిందని.. ఈసారి ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎవరి డ్యూటీ వారు సక్రమంగా చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు.గోల్కొండ జగదాంబిక అమ్మవారి తొలి బోనంతో బోనాల ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. గోల్కొండ జాతర, బల్కంపేట ఎల్లమ్మ తల్లి వార్షిక కల్యాణోత్సవం, లష్కర్, లాల్ దర్వాజ బోనాలు, అమ్మవారి అంబారి ఊరేగింపు, రంగం కార్యక్రమాలు అన్ని సక్రమంగా జరిగేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఈసారి బోనాలకు ప్రభుత్వం రూ. 20 కోట్లు- విడుదల చేసిందన్నారు. నూతన దేవాలయాలు యాడ్ అయ్యాయి కాబట్టి ఇంకో 10 శాతం ఫండ్స్ రిలీజ్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎండోమెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ చెక్కులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలన్నారు. డ్యూటీ లా కాకుండా ప్రతి ఒక్కరు అమ్మవారి ఆజ్ఞతో సేవ చేస్తున్నామని అనుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం జరగాలని కోరుకుంటు-న్నట్లు- మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ ఏడాది తొలి బోనం జూన్ 26న చారిత్రాత్మక గోల్కొండ కోటలో ప్రారంభం కానుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. తర్వాత వరుసగా బల్కంపేట ఎల్లమ్మ, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ బోనాలు జరగనున్నాయి. బోనాల పండుగను రాష్ట్ర గౌరవానికి మారు పేరుగా మార్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ. 20 కోట్లు- కేటాయించింది. పండుగకు ముందు దేవాలయాల అభివృద్ధికి ఇవ్వబోయే చెక్కులను రెవెన్యూ మరియు ఎండోమెంట్స్ శాఖలు సమన్వయం చేసుకొని పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.ప్రత్యేకంగా హైదరాబాద్ నగరానికి గుర్తింపు తీసుకొచ్చే బోనాల ఉత్సవాలపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. బోనాల పండుగను ఏ అడ్డంకులు లేకుండా నిర్వహించేం దుకు జీహెచ్ఎంసీ, శానిటేషన్, రెవెన్యూ, లైటింగ్, వాటర్ ఫెసిలిటీ-, కంట్రోల్ రూమ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. పోలీసు శాఖ లా అండ్ ఆర్డర్ పరంగా అప్రమత్తంగా ఉండాలి. అన్ని శాఖలతో సమన్వయం పెంచి పండుగ వేళ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. అధికారులు తమ బాధ్యతను కేవలం ఉద్యోగంగా కాకుండా, భక్తి భావంతో సేవగా భావించి ప్రతి చర్యను శ్రద్ధగా చేయాలని మంత్రి సూచించారు. ప్రత్యేకించి ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ, బల్కంపేట ఎల్లమ్మ ఉత్సవాలపై 'ప్లాన్ ఆఫ్ యాక్షన్' సిద్ధం చేయాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో బోనాల పండుగ విజయవంతంగా జరిగితే, ఇది హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకొస్తుంది అని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. అందరూ బాధ్యతగా తమ పనిని నిర్వహించి, నృత్యాలు, ఊరేగింపులు, సంప్రదాయ వేడుకలతో బోనాలను ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు.

## ఆడబిడ్డలపై చేయి వేయాలంటేనే భయపడాలి

అమరావతి,ఆడబిడ్డలపై చేయి వేయాలంటే భయపడే పరిస్థితిని రాష్ట్రంలో తీసుకురావాలని పోలీస్ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలంలో ఎనిమిదో తరగతి బాలికపై సామూహిక లైంగిక దాడి ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ ఘటనలో నిందితులను వెంటనే అరెస్ట్ చేసి.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం అమరావతిలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చోటు- చేసుకున్న ఘటనలపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఒక యువతి హత్య, మరో బాలికపై సామూహిక అత్యాచారం కేసును వేగంగా విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పక్కా ఆధారాల సేకరణతో నిర్దిష్ట సమయంలో నిందితులకు శిక్ష పడేలా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నానన్నారు. గంజాయి బ్యాచ్ ఆట కట్టించాలని స్పష్టం చేశారు. ఇక ఈ రెండు ఘటనల్లో దర్యాప్తు, చర్యల వివరాలను సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా డీజీపీ, ఉన్నతాధికారులు వివరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రామగిరి మండలంలో ఎనిమిదో తరగతి చదువుతోన్న దళిత బాలికపై గత రెండేళ్లుగా అత్యాచారం జరుగుతోంది. ఈ ఘటనలో యువకుల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆరుగురు నిందితులను మంగళవారం అచ్చంపల్లి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నారు. వారిని సైతం అరెస్ట్ చేస్తామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న వెల్లడించారు. బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించామన్నారు.

# మంత్రులకు శాఖల కేటాయింపులపై కసరత్తు



హైదరాబాద్,తెలంగాణ మంత్రుల శాఖల్లో భారీ మార్పులకు అవకాశం ఉన్నట్లు సమాచారం. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుతో పాటు శాఖల మార్పులపైన కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రెండురోజులుగా ఢిల్లీలో మకాం వేసిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఇకపోతే సోమవారం కాంగ్రెస్ కార్యదర్శి కేసీ వేణుగోపాలతో గంటకుపైగా రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి బేటి అయ్యారు. ఖర్గేతో భేటీ తరువాత మంత్రుల శాఖల మార్పులు ఖరారు కానున్నాయి సమాచరం. అలాగే కొత్త మంత్రులకు కూడా శాఖల కేటాయింపు జరుగుతుంది. ఈ క్రమంలో ప్రస్తుతం వివిధ శాఖలను నిర్వహిస్తున్న మంత్రుల శాఖల్లో కూడా మార్పులు చోటుచేసుకుంటాయని ప్రచారం నడుస్తోంది. మంత్రి పదవులే కాదు.. శాఖల కేటాయింపుల్లోనూ సామాజిక న్యాయంకు ప్రాధాన్యత నివ్వాలని కాంగ్రెస్ అధిష్టానం పేర్కొంది. కొందరు మంత్రుల పనితీరు సరిగా లేదంటూ ఇప్పటికే కొందరు పార్టీ నేతలు అధిష్టానానికి నివేదించారు. అలాగే మంత్రుల పనితీరుపై ఇప్పటికే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధిష్టానానికి నివేదిక ఇచ్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, వివిధ స్థాయి నేతలతో భేటీలో అందిన సమాచారం ఆధారంగా ఆమె నివేదికలు రూపొందించారు. కీలక శాఖల బాధ్యతలు అన్ని కొందరు మంత్రులే నిర్వహిస్తుండటంతో పని భారం కారణంగా కొన్ని శాఖల్లో ఆశించిన ఫలితాలు రావట్లేదనే అంచనలో కాంగ్రెస్ ముఖ్య నేతలు ఉన్నారు. మంత్రుల పనితీరు వ్యవహార శైలిపై కేసి వేణుగోపాల్ గతంలోనే ఢిల్లీలో సమావేశం నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ పాలనా వ్యవహారాలు, మంత్రుల వ్యవహార శైలి, పనితీరుపై తన అంచనాలను అధిష్టాన ముఖ్యులతో సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. విద్య, మున్సిపల్ పట్టణాభివృద్ధి, హోం, న్యాయం సహా పదికి పైగా కీలక శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖను విడగొట్టి మున్సిపల్ శాఖను మరొకరికి ఇచ్చే అవకాశం ఉంది. కాగా తనకు విద్యుత్తు లేదా విద్యాశాఖ ఇవ్వాలని వివేక్ కోరుతున్నారు. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వద్ద విద్యుత్ శాఖ ఉంది. త్వరలో కొన్ని కార్పొరేషన్ చైర్మన్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా తెలంగాణలో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖల కేటాయింపుపై హస్తినలో కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయి దాదాపు గంటసేపు చర్చించారు. మంత్రులకు శాఖల కేటాయింపుపైనే ప్రధానంగా వీరి చర్చ సాగినట్టు- తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఎవరెవరి దగ్గర ఏయే శాఖలున్నాయి? రెండు, మూడు మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారెవరు? కొత్తగా మంత్రివర్గంలో చేరిన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కు ఏ శాఖలు కేటాయించాలి? అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. దీనికి సంబంధించిన జాబితాను కేసీ వేణుగోపాల్‌కు సీఎం రేవంత్ అందించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలను కొత్తవారికి కేటాయించే అంశంపై సమాలోచన జరిగినట్టు- తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. అందులో ప్రధానమైనవి.. విద్య, పురపాలకం, హోం, గనులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ- సంక్షేమం, వాణిజ్య పన్నులు, పశుసంవర్ధక శాఖ, న్యాయ, కార్మిక, క్రీడలు యువజన శాఖ. వీటిలో విద్యా శాఖను తనకు కేటాయించాలని గడ్డం వివేక్ కోరుతున్నట్టు- తెలిసింది. ఇదే విషయాన్ని మల్లికార్జున ఖర్గేకు సైతం తెలియజేసినట్టు- సమాచారం. అయితే, వివేక్‌కు కార్మిక, మైనింగ్, క్రీడల శాఖ.. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, యువజన, న్యాయ లేదా మత్స్య శాఖ కేటాయించే అవకాశం ఉన్నట్టు- జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు-.. మంత్రివర్గంలో స్థానం దక్కుతుందని ఆశించి నిరాశ చెందిన వారి ప్రభావమెంత వారిని శాంతింపజేయడం ఎలా అనే అంశాలపై కూడా కేసీ, రేవంత్ రెడ్డి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. మంత్రివర్గంలో మరో ముగ్గురికి అవకాశం ఉన్న నేపథ్యంలో మిగిలిన వారికి ఈసారి చోటు- కల్పిస్తామనే నమ్మకం కలిగించాలని రేవంత్ రెడ్డికి కేసీ సూచించినట్టు తెలిసింది. అలాగే.. ప్రస్తుతం కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారి వ్యవహారశైలి, పనితీరు తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నట్టు- సమాచారం. ఈ నేపథ్యంలో ఒకరిద్దరి మంత్రుల శాఖల్లో మార్పులు చేసే అవకాశం ఉన్నట్టు- కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఉత్తమ్‌కు పిలుపు రావడంతో అనుమానలు బలపడుతున్నాయి. ఉత్తమ్ నీటిపారుదలతో పాటు పౌరసరఫరాల శాఖ నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన శాఖల్లో మార్పులు జరగవచ్చని అంటున్నారు.

# ఎంక్వైరీ..టెన్షన్! కాళేశ్వరంపై విజి'లెన్స్' ఫోకస్

హైదరాబాద్,కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో మరో ప్యాకేజీపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. నాలుగో లింక్‌లోని రెండో ప్యాకేజీగా జరిగిన అనంతగిరి రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసే వివరాలను వెంటనే అందజేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు సంబంధించి ఇటీవలే విచారణ ప్రారంభం కాగా, ఇప్పుడు మరో ప్యాకేజీపై విజిలెన్స్ దర్యాప్తు ప్రారంభించడం నీటి పారుదల శాఖలో సంచలనంగా మారింది. ఒక్కో ప్యాకేజీలో 60 మందికి పైగా ఇంజినీర్లు విచారణకు హాజరు కావాల్సి వస్తోంది. ఒక ప్యాకేజీలో విచారణ ఎదుర్కొన్న వారిలో అత్యధికులు ఇంకో ప్యాకేజీలో కూడా ఉంటున్నారు.

వరదకాలువ, మిడ్‌మానేరుపైనా ఫిర్యాదులు..

ఇటీవల కొండపోచమ్మసాగర్‌పైన, ఈ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసే పనులపైన, బస్వాపూర్ రిజర్వాయర్‌పైన విజిలెన్స్ దర్యాప్తు చేపట్టింది. కొండపోచమ్మ పనులపై 8 రోజులపాటు నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్, డిజైన్స్, రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ ఇలా వివిధ విభాగాలకు సంబంధించి ఉన్నత స్థాయి ఇంజినీర్ల నుంచి ఏఈఈల వరకు 60 మందికి పైగా ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు. మరోవైపు కాళేశ్వరంతో సంబంధం లేని, వరద కాలువలో భాగంగా నిర్మించిన మిడ్‌మానేరుపై 2021లోనే ఫిర్యాదు వచ్చింది. అయితే.. విచారణ చేపట్టలేదు. ఇటీవల విజిలెన్స్ విచారణ మొదలుపెట్టింది. ఇందులో ఈఎన్సీతో సహా ఆరుగురిని విచారణకు పిలిచారు. మిడ్‌మానేరుకు సంబంధించి ఈఎన్సీ జనరల్ అనిల్‌కుమార్ సోమవారం విజిలెన్స్ విచారణకు హాజరైనట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల తనిఖీ నివేదికలు

కాళేశ్వరం ఎత్తిపోతల నాలుగో లింకులోని అనంతగిరి రిజర్వాయర్ నుంచి



సిద్దిపేట జిల్లాలోని చిన్నగుండవల్లి వద్ద గల సిస్టర్న్ వరకు చేసిన పనులకు సంబంధించి ప్యాకేజీ రికార్డులన్నీ అందజేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి సిద్దిపేటలోని ఇరిగేషన్ డివిజన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. ఈ నెల 5వ తేదీన లేఖ రాసి వారంలోగా రికార్డులన్నీ అందజేయాలని కోరారు. జరిగిన పని, అయిన వ్యయం గురించి సమగ్ర వివరాలు అందజేయాలని, పరిపాలన, సాంకేతిక అనుమతులు, ఒప్పందం, అనుబంధ ఒప్పందాలు, బ్యాంకు గ్యారంటీలు, ఎం.బుక్కులు, డిజైన్లు, గ్రామాల వారీగా భూసేకరణ వివరాలు, నాణ్యతా రిపోర్టులు, ఉన్నతాధికారుల తనిఖీ నివేదికలు ఇలా మొత్తం 15 అంశాలపై నివేదికలు కోరారు.

ఇన్‌చార్జిగా ఉన్న ఈఈపైనే విచారణ..

ప్రస్తుతం లేఖ అందుకొన్న ఈఈని విజిలెన్స్‌లో నియమించాలని నీటిపారుదల శాఖ సిఫార్సు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం విజిలెన్స్‌లో ఈఈగా ఉన్న ప్రసాద్‌ను మార్చి కొత్త ఈఈను నియమించాలని నీటిపారుదల శాఖ నిర్ణయించారు. కానీ, ఇప్పుడు అదే ఈఈ ఇన్‌చార్జిగా ఉన్న ప్యాకేజీపై విచారణకు విజిలెన్స్ రంగంలోకి దిగడం చర్చనీయాంశంగా మారింది.

# వ్యవసాయ విధానంలో లోపం..సమగ్ర సాంకేతికతకు దూరం...



న్యూఢిల్లీ,కేంద్రం మద్దతు ధరలు ప్రకటించి..రైతుకు అండగా ఉన్నామని చెప్పడం...అయినా రైతుల పరిస్థితి మారడం లేదు. ఇటీవలే మద్దతు ధరలను కేంద్రం సవరించింది. వరి మొదలుకుని పలు పంటలకు మద్దతు ధరలను పెంచింది. అయితే వ్యవసాయ ముఖచిత్రం మారినా...ఆర్థికంగా రైతులు, దానిని నమ్ముకున్న ఇతర పనివాళ్లు బాగు పడడం లేదు. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరా ఘాతంగా మారింది. నూనెల ధరలు మండుతున్నా నూనెగింజల ఉత్పత్తిని ప్రోత్సహించడం లేదు. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గుతోంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం ఉన్నా..లేకున్నా ఇబ్బడి ముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. అలాగే మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. పంటల విధానంలో మార్పులు రావాలని రైతులతో పాటు, శాస్త్రవేత్తలు, నిపుణులు కూడా కోరుకుంటున్నారు. నిజానికి కార్పోరేట్ లేదా ఇతర కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం కానుంది. అయినా ఈ విషయంలో ప్రభుత్వాలది నిర్లక్ష్య ధోరణి తప్ప మరోటి కాదు. నేటికీ పంటల విధానం, కొనుగోళ్ల విధానం సక్రమంగా అమలు కావడం లేదు. ధాన్యాగారాల్లో మగ్గుతున్న ధాన్యం దేశం దాటి పోవడం లేదు. వాటిని ఇతర దేశాలకు అమ్ముకునేలా విధానాలు అమలు కావడం లేదు. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. అనేక కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయానికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకుంటే దేశంలోని సగం దరిద్రం పోతుంది. ఈ క్రమంలో సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇస్తే అంతర్జాతీయంగా మన పంటలకు డిమాండ్ కూడా పెరుగుతుంది. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయ భూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసుకుని.. అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిది. తెలంగాణలో పండే జొన్న, మక్కజొన్న,సజ్జ పంటలకు సరైన ధరలు రావడం లేదు. రైతులను ఆదుకున్నామని చెబుతున్న ప్రభుత్వాలు..క్షేత్రస్థాయిలో రైతులు ధాన్యం కొనాటంలూ ఆందోళన చేస్తున్నా పట్టించుకోని దౌర్భాగ్యం నేటికీ కనిపిస్తోంది. రైతుల గురించి మాట్లాడుతున్న పాలకులు ధాన్యం కొనుగోళ్లలో వస్తున్న ఆందోళనలను పట్టించుకోవడం లేదు. ముందుగా వానాకాలం ... తరవాత యాసంగిలో ఏ ధాన్యం వేయాలో మండలాల వారీగా నిర్ణయించి.. రైతులకు సూచనలు చేయాలి. అవసరమైతే వారినిచైతన్యం చేయాలి.కానీ అందుకు భిన్నంగా ప్రభుత్వాలు వ్యయసాయ విధానాలను కొనసాగిస్తున్నారు. నిజానికి ధాన్యం కొనుగోలు అన్నది ఒక పంటకు ముందే నిర్ణయించాలి. ఏ పంట వేయాలో ముందే చెప్పాలి. కానీ అదేమీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మీద కేంద్రం...కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వాలు దుమ్మెత్తి పోసుకోవడం సరికాదు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఒకరి మీద ఒకరు నెపం నెట్టేసుకోవడం తప్ప ధాన్యం నిల్వలను కొనేందుకు నిర్దుష్ట ప్రణాళికతో ముందుకు రావడం లేదు.

# ఆషాఢ బోనాలకు దగ్గర పడుతున్న సమయం

హైదరాబాద్, మరికొన్ని రోజుల్లో ఆషాడ మాసం రానుంది. ఈ నేపద్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలూ బోనాల జాతరను జరుపుకునేందుకు రెడీ అవుతున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి ఆషాడ మాసం ప్రారంభం కానుంది. అయితే మొదటి రోజే గురువారం రావడంతో జూన్ 26వ తేదీ నుంచే బోనాల సంబురాలు ప్రారంభం కానున్నాయి. జూన్ 26న ఆషాడం మాసం ప్రారంభం కానుంది. ఆరోజు గురువారం కనుక తొలి బోనం గోల్కొండ లోని అమ్మవారికి సమర్పించడంతో బోనాల సంబురాలు ప్రారంభం అవుతాయి. ఆషాఢ మాస బోనాల ఏర్పాట్ల గురించి ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. అధికారులకు సూచనలు ఇస్తోంది. జంట నగరాల్లోని మొత్తం 28 ఆలయాల్లో ఆషాఢ బోనాల జాతర ఘనంగా జరపాలని చెప్పారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రావొద్దని.. బోనాల పండగను జరపడం కోసం ఎక్కడ లోటు- లేకుండా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని.. ప్రభుత్వం నుంచి ఇప్పటికే రూ 20 కోట్ల మంజూరు చేశామని చెప్పారు. ఒకవేళ బోనాల ఏర్పాట్లకు ఈ డబ్బులు సరిపోలేదు ఇంకా కావాలంటే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్నీ తీసుకెళ్దామని.. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. భక్తులకు ఇబ్బందులు ఎక్కడా రానివ్వకుండా ఏర్పాట్లు- చేయాలనీ అధికారులకు సూచించారు. ఆషాఢ మాస బోనాలు సందర్భంగా అమ్మవారి ఆశీర్వాదం అందరి మీద ఉండాలని.. గతంలో ఏర్పాట్లు- చేసే సమయంలో జరిగిన సమస్యలను దృష్టిలో పెట్టుకుని.. మళ్ళీ జరగకుండా ఈ ఏడాది



ముందస్తుగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎ÷-లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేసుకుని ముందుకు వెళ్ళాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. గోల్కొండ తర్వాత వరసగా బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ బోనాలు ఉంటాయి. ఈ బోనాల సందర్భంలో విధులను నిర్వహించే అధికారులు.. ఉద్యోగంలా భావించకుండా.. ఒక సేవ చేస్తున్నామని భావించాలని చెప్పారు. ఎందుకంటే సాంస్కృతిక కార్యక్రమాలు దైవ చింతనతో జరగాలని అన్నారు. అదే విధంగా బోనాల జాతరలో విధులను నిర్వహించే పోలీస్ సిబ్బంది.. లా అండ్ ఆర్డర్ ఎక్కడ ఇబ్బందులు లేకుండా అన్ని రకాల శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

# బయోసైన్స్, కృత్రిమ మేధలో పెట్టుబడులకు అనుకూలం



హైదరాబాద్,తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల్లో చూపించే ప్రభుత్వం అని ఐటీ- శాఖా మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ ప్రతిభకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. పెట్టుబడుల విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేయొద్దని, తెలంగాణకు వచ్చే పెట్టుబడులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తోందని, తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు చూసి షైవ గ్రూప్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పుకుందని తెలిపారు. తెలంగాణలో షైవా గ్రూప్ భాగస్వామిగా మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. షైవా గ్రూప్, టారానిస్ క్యాపిటల్ కలిపి రాష్ట్రంలో రూ.2,125 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బయోసైన్స్, కృత్రిమ మేధలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమన్నారు. తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏడాదిన్నరలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఏడాదిన్నరలో రూ.3లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టు-బడిదారులు ముందుకు వస్తున్నారన్నారు. యువత మన ఆస్తి.. వారిలో నైపుణ్యాలు నింపేందుకు స్కిల్ యూనివర్సిటీ- ఏర్పాటు- చేశామని తెలిపారు. రాష్ట్రం అవకాశాల గని.. ఆవిష్కరణలకు, అవకాశాలకు, ప్రతిభకు కేంద్రమని పేర్కొన్నారు. అంతర్జాతీయ భాగస్వాములను రాష్ట్రం ఆకర్షిస్తోందన్నారు. 18 నెలల్లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు కుదిరాయని, లక్ష మందికి తెలంగాణ యువతకు ఉపాధి లభించిందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. 'తెలంగాణ ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు చూసి శైవ గ్రూప్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పుకుంది. 13 వందల కోట్లతో బయోటెక్ సంస్థ పెట్టుబడులు పెడుతున్నారు. ఐదు సంస్థల్లో 2100 కోట్లు-, 5 వేల మందికి ఉపాధి కలగనుంది. సాంకేతిక పరమైన కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం పెట్టుబడి దారులకు సహకారం అందిస్తుంది. 18 నెలల్లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు, లక్ష మందికి తెలంగాణ యువతకు ఉపాధి లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి అడుగు నుంచే విమర్శలు చేస్తున్నారు. మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల్లో చూపిస్తున్నాం' అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'పెట్టుబడులు రావడం లేదు, కంపెనీలు పోతున్నాయి అనే విమర్శలకు ఇది కౌంటర్ అన్నారు. తెలంగాణకు వచ్చే పెట్టు-బడులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా?. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో యువతకు మరింత ఉపాధి లభించనుంది. తెలంగాణ ప్రతిభకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారింది. పెట్టుబడుల విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేయొద్దు. పరిశ్రమల వాతావరణాన్ని డిస్టర్బ్ చేయొద్దు. భవిష్యత్తులో పెద్ద సంఖ్యలో పెట్టు-బడులు తీసుకొస్తాం' అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు.

# విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం ..ఏటేటా పెరుగుతున్న సమస్యలు

హైదరాబాద్,పాఠశాల విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఏటేటా బంద్‌లు,ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. ప్రభుత్వం విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని, ఎంఈవో పోస్టులను భర్తీ చేయడం విస్మరించిందని అంటున్నారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేయాలని, అభివృద్ధికి పాటుపడాలన్నారు. పాఠశాలల అధిక ఫీజుల దోపిడి అరికట్టాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు, ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాఠశాల నిర్వాహణ వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ముకాసే రీతిలో వ్యవహరిస్తున్నదని మండిపడుతున్నాయి. ప్రభుత్వమే విద్యాసంస్థలను నిర్లక్ష్యం చేస్తున్నదని ఏబీవీపీ నేతలు ఆరోపించారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ జరగడం లేదన్నారు. విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ జరగలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. వసతుల లేమి సౌకర్యాల కరువుతో విద్యార్థులు సతమతమవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ఉపాధ్యాయుల కొరత నేటికి తీరలేదన్నారు. ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యపు ధోరణి విడనాడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థ మెరుగుదలకు తక్షణమే చర్యలు చేపట్టనున్నారు. లేని పక్షంలో తమ ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. మరోవైపు పాఠశాలలు పునఃప్రారంభం కాబోతున్నాయి. 12న పాఠశాలలు తెరచుకోనున్నాయి. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలల తెరుఉకున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా సర్కారు బడుల్లో



మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఓ వైపు ప్రభుత్వం చెబుతోంది. మరో వైపు సర్కారు బడుల్లో సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకోవడం లేదు. పాఠశాలలు తెరిచి మూడు వారాలు దాటినా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందడంలేదు. ఏటా ఇదే తంతు కొనసాగు తోంది. దీంతో బోధనకు ఆటంకం కలుగుతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్య పుస్త కాలను సమ కూర్చేవారు. పాఠశాలలు ప్రారంభం అయ్యాక హెచ్‌ఎంలు వాటిని తీసుకువెళ్లి విద్యార్థులకు అందించేవారు. కాగా ప్రస్తుతం పుస్తకాలు సగం వరకే రావడంతో వచ్చిన వాటిని అయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. ఇవి కాక టాయ్‌లెట్‌లు మంచినీరు, కాంపౌండ్ వాల్ నిర్మాణాల వంటి సమస్యలు ఉండనే ఉన్నాయి. వీటిని గ్రామాల వారీగా గుర్తించ పరిష్కరించాల్సి ఉంది. అప్పుడే పాఠశాలలు బలోపేతం అవుతాయ.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com